ఆంధ్రజ్యోతి

పోటెత్తిన భక్తులు

ఉయ్యూరు వీరమ్మ తిరునాళ్లకు భక్తులు పోటెత్తారు. ఏడో రోజు, మొదటి ఆదివారం కావడంతో పెద్దసంఖ్యలో తరలివచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం, రహదారులు జనసంద్రమయ్యాయి. అమ్మవారి ఆలయ ప్రాంగణంలో పాలపొంగళ్లు వండి నైవేద్యం, చీర సారె, పసుపుకుంకుమ సమర్పించారు.

- 6లో..



ముగిసిన పరీక్ష

జిల్లాలో గ్రూప్-2 స్క్రీనింగ్ పరీక్ష ఆదివారం ప్రశాంతంగా జరిగింది. మొత్తం 51 పరీక్షా కేంద్రాల్లో ఈ పరీక్ష జరిగింది. 17,241 మంది అభ్యర్థులకుగాను 13,341 మంది హాజరయ్యారు. 77.38 శాతం హాజరు నమోదైంది. పరీక్షా కేంద్రాల వద్ద అభ్యర్థులు భారీ క్యూలైన్లలో నిల్చున్నారు.

- 6లో..



ఆర్కే కళాశాల వద్ద అభ్యర్థుల క్యూ



హిందూ కళాశాల వద్ద హాల్‌టికెట్‌ను పరిశీలించుకుంటున్న అభ్యర్థులు

గన్నవరంలో గరళం!

తాగునీటి రిజర్వాయర్‌లోకి కలుషిత నీరు మళ్లింపు



కొనాయి చెరువు రిజర్వాయర్

వేసవి రానే వచ్చింది. ప్రజలకు తాగునీటి అవసరం పెరుగుతుంది. ఇందుకోసం సమ్మర్ యాక్షన్ ప్లాన్ రూపొందించాల్సిన తరుణంలో పలు గ్రామ పంచాయతీలు ప్రజారోగ్యాన్ని పణంగా పెడుతున్నాయి. ఖర్చులేని పనులకు శ్రీకారం చుడుతూ విష జలాన్ని వదులుతున్నాయి. అపరిశుద్ధ జలాన్ని ఫిల్టరైజేషన్ కూడా చేయకుండా నేరుగా రిజర్వాయర్లలోకి మళ్లించి సరఫరా చేస్తున్నారు. ఉమ్మడి కృష్ణాజిల్లాలో మేజర్ గ్రామ పంచాయతీల్లో ఒకటి అయిన గన్నవరం పంచాయతీలో ఈ దుస్థితి నెలకొంది.



కొనాయి చెరువు రిజర్వాయర్‌లోకి వెళుతున్న కలుషిత నీరు

- వేసవి వేళ ప్రజారోగ్యాన్ని పణంగా పెట్టిన పంచాయతీ
- తొండంగట్టు చెరువులో వ్యర్థ జలాలు, చేపల పెంపకం
- ఆ నీటిని ఫిల్టర్ చేయకుండా రిజర్వాయర్‌కు పంపింగ్
- మూలన పడిన పంపింగ్ స్కీమ్.. మోటార్లు ఫట్

(ఆంధ్రజ్యోతి, విజయవాడ/గన్నవరం) : గన్నవరం పట్టణానికి ప్రధాన మంచినీటి రిజర్వాయర్ అయిన కోనాయి చెరువుకు గండి కొట్టి సమీపంలోని తొండంగట్టు చెరువులోని వ్యర్థ జలాలను మళ్లిస్తున్నారు. తొండంగట్టు గుంట అనేక రకాల వ్యర్థాలతో నిండి ఉంటుంది. ఇందులో చేపలు కూడా పెంచుతున్నారు. నీరు దుర్గంధం, దుర్వాసనలతో ఉంటుంది. అలాంటి నీటిని ఫిల్టరైజేషన్ కూడా చేయకుండా రిజర్వాయర్‌కు గండి కొట్టి తొండంగట్టు చెరువు నీటిని మళ్లిస్తున్నారు.

అధికార పార్టీ నేత హస్తం

గన్నవరం పంచాయతీ కార్యదర్శి అనిల్ కుమార్ గండి కొట్టమని సిబ్బందిని ఆదేశించారు. రిజర్వాయర్‌కు గండిపెట్టడమేమిటని, వివాదం అవుతుందని స్థానిక సిబ్బంది చెప్పినా పెడచెవిన పెట్టారు. ఏదైనా అయితే తనను ఇక్కడకు తీసుకువచ్చిన అధికార పార్టీ ప్రజాప్రతినిధి అనుచరుడు చూసుకుంటాడని బెదిరించి బలవంతంగా గండి కొట్టించినట్టుగా తెలుస్తోంది.

పనిచేయని మోటార్లు

గన్నవరం ప్రజలు ఫ్లోరైడ్ నీటిని తాగాల్సి వస్తుందన్న ఉద్దేశంతో 2007లో రూ.3 కోట్లతో ఫిల్టర్ బెడ్‌లు ఏర్పాటు చేశారు. దావాజీగూడెం వంతెన దగ్గర ఉన్న రెండు మోటార్లలో ఒకటి పనిచేయడం లేదు. దానికి ఇప్పటికీ మరమ్మతులు చేపట్టలేదు. ఒక్క మోటారే పనిచేస్తోంది. దీనికితోడు గన్నవరం వాటర్ ప్లాంట్ దగ్గర కూడా మోటార్లు పనిచేయటం లేదు. రివర్స్‌లో మోటార్లను ఆడటం వల్ల మరమ్మతులకు గురైనట్టు తెలుస్తోంది. గన్నవరం గ్రామ పంచాయతీకి ఏడాదికి ఐదు కోట్ల మేర దండిగా ఆదాయం వస్తున్నా రానున్న వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని వీటిని మరమ్మతులు చేయాల్సిన పంచాయతీ అధికారులు ఆ పని చేయకుండా రిజర్వాయర్‌కు గండి కొట్టి కలుషిత నీటిని మళ్లిస్తున్నారు.

తెంపల్లి ఉదంతంతో కళ్లు తెరవరా?

గన్నవరం మండలంలో తెంపల్లిలో సరిగ్గా ఏడాది కిందట కలుషిత నీటి వల్ల ప్రాణాంతక క్లెబ్సియల్లా వైరస్ సోకి ముగ్గురు మృతి చెందారు. వంద మందికిపైగా తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. ఊరంతా వణికిపోయింది. ఈ ఉదంతాల గుణపాఠాలను నేర్వని గన్నవరం పంచాయతీ అధికారులు ప్రజారోగ్యాన్ని పణంగా పెట్టడం గమనార్హం.

ఎన్నో పంచాయతీల్లో నిండు నిర్లక్ష్యం

గన్నవరం పంచాయతీతో పాటు అనేక పంచాయతీలు తాగునీటి కొరతను, కలుషిత నీటి సమస్యను ఎదుర్కొంటున్నాయి.

- ఇదే మండలం పరిధిలోని కేసరపల్లి పంచాయతీ హామ్లెట్ అయిన వెంకట నరసింహాపురంలో నీటి కొరత నెలకొంది. డ్రెయిన్లు లేకపోవటం వల్ల పైపులైన్లు లీకై ఇళ్లలోకి మురుగునీరు వచ్చిన ఉదంతాలు ఉన్నాయి.
- ఎన్టీఆర్ జిల్లా ఏ కొండూరు మండల పరిధిలో రక్షిత మంచినీటి సరఫరా అనేది ప్రకటనలకే పరిమితమైంది. కృష్ణా నీటిని ఒడిసి పట్టి అందిస్తామన్న ప్రత్యేక కార్యక్రమానికి ఫుల్‌స్టాప్ పడింది. ఒకపక్క ఏ కొండూరు మండలం పరిధిలోని అనేక గ్రామాల ప్రజలు కిడ్నీ సంబంధిత వ్యాధులతో బాధ పడుతున్నారు. ఈ సమస్యకు ప్రధానంగా సురక్షితం కానటువంటి మంచినీరేనని పరీక్షలలో తేల్చారు. పునరుద్ధరణ పనుల కోసం బడ్జెట్ కేటాయింపులు లేకపోవటంతో ఏ కొండూరు మండల ప్రజలు ఈ వేసవిలో తాగునీటి కష్టాలు ఎదుర్కోనున్నారు.



కొలుసు పార్థసారథి



బొప్పన భవకుమార్

నేడు టీడీపీలోకి పార్థసారథి

బొప్పన భవకుమార్ కూడా..

చంద్రబాబుతో సమావేశమైన దేవినేని ఉమా

వసంత చేరిక వాయిదా

(విజయవాడ - ఆంధ్రజ్యోతి) పెనమలూరు వైసీపీ ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి సోమవారం టీడీపీలో చేరనున్నారు. అయనతోపాటు విజయవాడ నగర వైసీపీ అధ్యక్షుడిగా పనిచేసిన బొప్పన భవకుమార్ కూడా పార్టీ కండువా కప్పుకోనున్నారు. పార్థసారథి, భవకుమార్ ఎన్టీఆర్ సర్కిల్ వద్ద ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి భారీ ర్యాలీగా మంగళగిరి టీడీపీ కార్యాలయానికి వెళ్లి పార్టీ అధినేత సమక్షంలో టీడీపీ కండువా కప్పుకోనున్నారు. పార్థసారథికి నూజివీడు టికెట్‌ను ఇప్పటికే కేటాయించారు. వీరితోపాటే టీడీపీలో చేరుతారని భావించిన మైలవరం వైసీపీ ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ చేరిక మాత్రం మరికొన్ని రోజులు వాయిదా పడింది.

చంద్రబాబుతో ఉమా భేటీ

మరోవైపు మైలవరం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి, మాజీ మంత్రి దేవినేని ఉమా సోమవారం సాయంత్రం టీడీపీ అధినేత చంద్రబాబును కలిశారు. మైలవరం నుంచి వసంతను బరిలోకి దింపే విషయమై వీరి నడుమ చర్చ జరిగినట్లు తెలుస్తోంది. ఉమాను ఒప్పించిన తర్వాతే వసంతను పార్టీలోకి చేర్చుకోవాలని పార్టీ అధినేత భావించడంతో వసంత చేరిక వాయిదా పడినట్టు సమాచారం. చంద్రబాబును కలిసిన అనంతరం ఉమా మాట్లాడుతూ 'చంద్రబాబు కుటుంబ సభ్యుడిని నేను. చంద్రబాబు అంటే నాకు శిరోధార్యం' అని అన్నారు. మరోవైపు బొమ్మసాని సుబ్బారావు ఆదివారం గొల్లపూడిలో తన అనుచరులతో సమావేశమయ్యారు. వసంత చేరికను వ్యతిరేకించాలని ఈ సమావేశంలో నిర్ణయించారు.

వైసీపీ మూక రాప్తాడులో జర్నలిస్టుపై దాడికి పాల్పడిన ఘటన మరువక ముందే మరోదాడికి పాల్పడింది. ఈసారి దళితులను లక్ష్యం చేసుకుంది. జగ్గయ్యపేటలో టీడీపీకి చెందిన దళితులు ఆదివారం నిర్వహిస్తున్న ర్యాలీలోకి జొరబడి కవ్వింపు చర్యలకు పాల్పడి ఉద్రిక్తత సృష్టించింది. ఇదేమని అడిగిన వారిపై వైసీపీ మూక విరుచుకుపడింది. టీడీపీ కౌన్సిలర్‌నూ, మరో కార్యకర్తనూ తల పగులగొట్టింది. అయినా కసి తీరక ఎన్టీఆర్ సర్కిల్ వద్ద మరోసారి దాడికి యత్నించడంతో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది.

పాత మునిసిపల్ ఆఫీసు గేటు ముందు టీడీపీ కార్యకర్తలను అడ్డుకుంటున్న పోలీసులు



దళితులపై వైసీపీ మూక దాడి

టీడీపీ ఎస్సీ విభాగం ర్యాలీలోకి చొరబడి వైసీపీ శ్రేణుల కవ్వింపు చర్యలు

- టీడీపీ కౌన్సిలర్, కార్యకర్తపై దాడి
- సంయమనంతో ర్యాలీ కొనసాగించిన టీడీపీ దళిత శ్రేణులు
- మళ్లీ కవ్వింపు చర్యలకు పాల్పడిన వైసీపీ శ్రేణులు
- టీడీపీ శ్రేణుల ప్రతిఘటనతో పాత మునిసిపల్ ఆఫీసులో తలదాచుకున్న వైసీపీ మూక
- రక్షణ కల్పించిన పోలీసులు

జగ్గయ్యపేట, ఫిబ్రవరి 25 : ఎస్సీ వర్గాలకు టీడీపీ ప్రభుత్వ హయాంలో కలిగిన ప్రయోజనాలను వివరించేందుకు ఆ పార్టీ ఎస్సీ విభాగం ఆధ్వర్యాన ఆదివారం పట్టణంలో 'దళితుల పిలుపు - తాతయ్య గెలుపు' పేరుతో ఆత్మీయ సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య నివాసానికి నియోజకవర్గం నుంచి దళితులు భారీగా తరలిరాగా మధ్యాహ్నం ర్యాలీ బయల్దేరింది. అదే సమయంలో ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను బలుసుపాడు రోడ్డులో టిడ్కో గృహాల వద్ద జరుగుతున్న పనులను పరిశీలించి వస్తున్నారు. ఆయన వెంట ఉన్న కౌన్సిలర్లు, ఇతర కార్యకర్తలు టీడీపీ ర్యాలీలోకి వైసీపీ జెండా పట్టుకుని వచ్చారు. అదేంటని వారించిన బూదవాడకు చెందిన గిరిజన కార్యకర్త గుగ్లోతు రాంబాబును తలపై బాదారు. ఆయనకు రక్తగాయాలయ్యాయి.



దాడిలో తలకు గాయాలైన గిరిజన కార్యకర్త రాంబాబు

● వైసీపీ మూకకు పోలీసుల రక్షణ

పోలీసులు టీడీపీ ర్యాలీని ఆపి వారిని పంపించేశారు. టీడీపీ ర్యాలీ ఎన్టీఆర్ సర్కిల్‌కు చేరుకున్నాక మరోసారి ర్యాలీలో వైసీపీ కార్యకర్తలు టీడీపీ ర్యాలీలోకి జెండాలతో జొరబడి మళ్లీ నినాదాలు చేశారు. వారికి నచ్చజెప్పేందుకు వెళ్లిన టీడీపీ దళిత కౌన్సిలర్ నకిరికంటి వెంకటిపై దాడికి యత్నించారు. దీంతో టీడీపీ కార్యకర్తలు ఒక్కసారిగా మెరుపుదాడికి దిగారు. వైసీపీ కార్యకర్తలు పాతమునిసిపల్ కార్యాలయంలోకి వెళ్లి మెష్‌డోర్ వేసుకున్నారు. పోలీసులు పాత కార్యాలయం ప్రహరీ గేటు వేసి వైసీపీ కార్యకర్తలకు రక్షణ కల్పించారు.

● రెండోసారి కవ్వింపు చర్యలు

పోలీసులు ప్రహరీ వద్ద కాపలాగా ఉండగానే వైసీపీ శ్రేణులు లోపల నుంచి వచ్చి మళ్లీ కవ్వింపులకు దిగడంతో తీవ్ర ఉద్రిక్తతకు దారి తీసింది. టీడీపీ కార్యకర్తలు పాత మునిసిపల్ కార్యాలయంలోకి వెళ్లేందుకు యత్నించటంతో పోలీసులు, టీడీపీ నేతలు తీవ్ర ప్రయత్నం చేసి నిలువరించారు. పరిస్థితిని గమనించి కొత్త మునిసిపల్ కార్యాలయానికి రాకుండా ఉదయభానును పోలీసులు పంపించారు. ఆ తర్వాత టీడీపీ ర్యాలీ ముందుకు కొనసాగి శుభమస్తు కల్యాణ మండపానికి చేరుకుంది.

టీడీపీలో సమరోత్సాహం!



ఐదు నియోజకవర్గాల్లో అభ్యర్థుల ప్రకటనతో టీడీపీ శ్రేణుల్లో జోష్

- జనసేన నేతలతో కలిసి ప్రచారానికి సమాయత్తం
- అవినీతి, అక్రమాలు, అభివృద్ధి లేమితో ప్రజల్లో వ్యతిరేకత మూటగట్టుకున్న వైసీపీ

జిల్లాలో రాజకీయ కాక రాజుకుంది. ఐదు నియోజకవర్గాలకు టీడీపీ అభ్యర్థులు ఖరారు కావడంతో పార్టీ శ్రేణుల్లో జోష్ నెలకొంది. ఆ పార్టీ అభ్యర్థులు జనసేన నేతలను కలుపుకొని ప్రజల్లోకి వెళుతున్నారు. ఉమ్మడి అభ్యర్థులను గెలిపించాలనే సంకల్పంతో ముందడుగు వేస్తున్నాయి. వైసీపీ శాసనసభ్యులు, నాయకులు ఐదు సంవత్సరాలుగా ప్రజలను పట్టించుకోకుండా వ్యవహరించిన తీరుపై విసిగివేసారిన ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు కొందరు టీడీపీని బలపరిచేందుకు సమాయత్తమవుతున్నారు. కొన్ని నియోజకవర్గాల్లో ఆ పార్టీ ఎమ్మెల్యేలు అవినీతి, అక్రమాలు, అభివృద్ధి లేమితో ప్రజల్లో వ్యతిరేకత మూటగట్టుకున్నారు. వీటినే ప్రచార అస్త్రాలుగా వినియోగించుకునేందుకు టీడీపీ అభ్యర్థులు సిద్ధమవుతున్నారు. - మచిలీపట్నం,ఆంధ్రజ్యోతి

కొల్లుతో కలిసి పనిచేసేందుకు ముందుకొస్తున్న వైసీపీ నేతలు

బందరు నియోజకవర్గంలో మాజీమంత్రి కొల్లు రవీంద్రను టీడీపీ అభ్యర్థిగా ప్రకటించడంతో పార్టీ నాయకత్వం రెట్టించిన ఉత్సాహంతో పనిచేసేందుకు సమాయత్తమవుతోంది. వైసీపీలో అసంతృప్తితో రగిలిపోతున్న నాయకులు రవీంద్రతో కలిసి పనిచేసేందుకు ముందుకొస్తున్నారు. వైసీపీ నాయకుడు నాలి మాధవ ఇటీవల ఆ పార్టీకి రాజీనామా చేశారు. ఆయన భార్య శారద వైసీపీ తరుపున కార్పొరేటర్‌గా ఉన్నారు. ఆదివారం నాలి మాధవ కొల్లు రవీంద్రను కలిసి త్వరలో టీడీపీలో చేరతానని ప్రకటించారు. మత్స్యకారులు, యాదవ సామాజిక వర్గానికి చెందిన కొందరు త్వరలో టీడీపీలో చేరనున్నారు. స్థానిక శాసనసభ్యుడు గత ఐదు సంవత్సరాలుగా వైసీపీ నాయకులను, కార్యకర్తలను దూరంపెట్టిన నేపథ్యంలో అధికశాతం మంది సీనియర్ వైసీపీ నాయకులు, కార్యకర్తలు అసంతృప్తితో రగిలిపోతున్నారు. వీరంతా టీడీపీ వైపు చూస్తున్నారు.

అనిల్‌పై వ్యతిరేకతే వర్లకు సానుకూలత

పామర్రు నియోజకవర్గం నుంచి వర్ల కుమార్‌రాజా తొలిసారిగా ఎన్నికల గోదాలోకి దిగనున్నారు. కొన్నేళ్లుగా ఆయన పార్టీ కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. స్థానిక శాసనసభ్యుడు కైలే అనిల్‌కుమార్‌పై ప్రజల్లో వ్యతిరేకతను తమకు అనుకూలంగా మలుచుకునేందుకు టీడీపీ నాయకులు తమవంతుగా ప్రయత్నాలు ప్రారంభించారు. పామర్రులో పేదలకు ఇళ్లపట్టాలు ఇవ్వకపోవడాన్ని, కృష్ణానది నుంచి ఇసుక తరలింపులో ఎమ్మెల్యే వ్యవహరించిన తీరును టీడీపీ నాయకులు తెరపైకి తెస్తున్నారు. నియోజకవర్గంలో ఒక్క అభివృద్ధి కార్యక్రమం కూడా లేకపోవడంతో ఆయన వ్యతిరేకతను మూటగట్టుకున్నారు. డీవైదాస్ కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీచేస్తే, వైసీపీ ఓటు బ్యాంకును చీల్చడం ఖాయం. ఈ ప్రభావం నియోజకవర్గంలో వైసీపీ అభ్యర్థిపై పడుతుందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.

- మిగతా 6లో

ఆగని పండు ఆగడాలు

ఉయ్యూరు తిరునాళ్లలో యువకుడిపై బీరు సీసాతో దాడి

- పోలీసులపై సోషల్ మీడియాలో పోస్టింగ్‌లు
- నా మీద చేయి వేస్తే కోసేస్తానంటూ పరోక్ష హెచ్చరిక

విజయవాడ, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : కోడూరి మణికంఠ అలియాస్ పండు... గ్యాంగ్‌వార్‌లో ప్రధాన నిందితుడు. అతడి ఆగడాలు మాత్రం ఆగడం లేదు. ఒక గ్యాంగ్‌ను నడుపుతూ రెచ్చిపోతున్నాడు. తాజాగా ఉయ్యూరులో వీరమ్మ తిరునాళ్లకు వెళ్లి ఓ యువకుడిపై బీరు సీసాతో దాడి చేశాడు. దీనిపై కేసు నమోదవుతుందని గ్రహించి తానూ బీరు సీసాతో దాడి చేసుకున్నాడు. ఈ ఘటన ఆదివారం మధ్యాహ్నం జరిగింది. విజయవాడ పటమటకు చెందిన ఉజ్వల్ ఉయ్యూరులో వీరమ్మకు మొక్కులు తీర్చుకుని భోజనాలు పెట్టాడు. దీనికి స్నేహితులను, బంధువులను ఆహ్వానించాడు. ఇందులో భాగంగా పండు, అతడి స్నేహితులను పిలిచాడు. భోజనాలు అయిన తర్వాత సిగరెట్ వెలిగించుకునే విషయంలో ఉజ్వల్, పండుకు మధ్య వివాదం జరిగింది. వారిని విడదీయడానికి పటమటకు చెందిన సంతోష్ అనే యువకుడు మధ్యలో వెళ్లాడు. అసలు మధ్యలో రావడానికి నువ్వు ఎవడివిరా అంటూ పండు తిరగబడ్డాడు. అక్కడే ఉన్న మనోహర్, సాయి, సురేష్ అతడిని పట్టుకుని కారు వద్దకు తీసుకెళ్లారు. అందులో ఉన్న బీరు సీసా తీసుకుని పండు ఆ యువకుడి తలపై బలంగా కొట్టాడు. సీసాతో పెదవులపై గుచ్చాడు. అతడిని అక్కడే ఉన్న వారు విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. సంతోష్ కేసు పెడతాడని గ్రహించిన పండు కొత్త నాటకానికి తెరదీశాడు.



గాయపడిన సంతోష్

ఆ బీరు సీసాతో తలపై కొట్టుకున్నాడు. మనోహర్ బ్లేడ్‌తో మెడ, తొడలపై కోసుకున్నాడు. ఇద్దరూ కలిసి కారులో ప్రభుత్వాసుపత్రికి వచ్చారు. పండుకు గాయం కాకపోవడంతో అతడు అక్కడి నుంచి వెళ్లిపోయాడు. మనోహర్‌ను ఆసుపత్రిలో చేర్పించాడు. తర్వాత పండు తల్లి పద్మావతి ఆసుపత్రికి వచ్చి సంతోష్‌తో బేరసారాలు మొదలుపెట్టింది. పోలీసులు అడిగితే జరిగిన విషయం చెప్పకుండా కింద పడిపోయానని చెప్పాలని బెదిరించింది. దీనిపై ఉయ్యూరు పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులను ఉద్దేశించి పండు సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేసిన వీడియో వైరల్ అవుతోంది. "నా మీద చేయి వేసి చూడు. నువ్వు హెడ్‌కానిస్టేబుల్‌వి. నీ చేతిలో లాఠీ ఉంది. దమ్ముంటే నా మీద చేయి వేసి చూడమను. ఎవరైనా సరే కోసేస్తా" అని ఓ సినిమాలో ఉన్న సన్నివేశానికి కింద తన ఫొటో పెట్టుకుని సామాజిక మాధ్యమాల్లోకి వదిలాడు. ఈ వీడియో ద్వారా పోలీసులకు పరోక్షంగా హెచ్చరిక ఇచ్చాడని అతడి గ్యాంగ్ సభ్యులు బయట చెప్పుకుంటున్నారు.

ప్రశాంతంగా గ్రూప్-2 స్క్రీనింగ్ పరీక్ష



కుమార్తెను పరీక్షా కేంద్రానికి ఎత్తుకుని తీసుకువస్తున్న తండ్రి

» కృష్ణాజిల్లాలో 77.38 శాతం హాజరు

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 25 : కృష్ణాజిల్లాలో ఆదివారం 51 పరీక్షా కేంద్రాల్లో గ్రూప్-2 స్క్రీనింగ్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. 17241 మంది విద్యార్థులకు 13341 మంది హాజరయ్యారు.77.38 శాతం హాజరు నమోదైంది. ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగలేదు. మచిలీపట్నంలోని 11 పరీక్షా కేంద్రాల్లో 3190 మంది విద్యార్థులకు 2533 మంది హాజరయ్యారు. చిలకలపూడి ఎస్వీహెచ్ ఇంజనీరింగ్ కళాశాలలోని పరీక్షా కేంద్రాన్ని, పద్మావతి హిందూ మహిళా డిగ్రీ కళాశాలను జిల్లా ఎస్పీ, జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ, ఆర్డీవో వాణి సందర్శించారు. పోలీసు బందోబస్తు మధ్య పరీక్షలు జరిగాయి.

నిరుద్యోగుల హృదయాలను కదిల్చిన దివ్యాంగురాలు హేమశ్రీ

మచిలీపట్నం పద్మావతి హిందూ మహిళా డిగ్రీ కళాశాలలో ఆదివారం జరిగిన గ్రూప్-2 స్క్రీనింగ్ పరీక్షా కేంద్రం వద్ద మొవ్వకు చెందిన దివ్యాంగురాలు ఈడే హేమశ్రీని ఆమె తండ్రి శ్రీనివాసరావు ఎత్తుకుని పరీక్షా కేంద్రానికి తీసుకుని వచ్చారు. హేమశ్రీకి చేతులు, కాళ్లు కదలిక లేకుండా ఉన్నాయి. మొవ్వ డిగ్రీ కళాశాలలో బీఏ చదివిన ఈమెను పద్మావతి హిందూ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ అన్నపూర్ణ సబ్‌స్రైబర్‌ను ఇచ్చారు. ఆర్డీవో కావాలనుకుంటున్నట్టు హేమశ్రీ తెలిపింది. దివ్యాంగురాలు హేమశ్రీని చూసిన నిరుద్యోగుల హృదయాలు చలించిపోయాయి. పట్టుదల, ఆత్మ విశ్వాసం ఉంటే విజయాలు సొంతమవుతాయని హేమశ్రీ నిరూపించగలదని ప్రిన్సిపాల్ అన్నపూర్ణ పేర్కొన్నారు.

ఎన్టీఆర్ జిల్లాలో 83.31 శాతం హాజరు

వన్‌టౌన్ : గ్రూప్-2 స్క్రీనింగ్ పరీక్ష ఎన్టీఆర్ జిల్లాలో ప్రశాంతంగా జరిగినట్టు కలెక్టర్ ఢిల్లీరావు ప్రకటించారు. ఆదివారం జిల్లాలో పరీక్షా కేంద్రాలను ఆయన పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో 54 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయగా.. 24373 మందికిగాను 20304 మంది (83.31 శాతం) పరీక్ష రాసినట్టు తెలిపారు. ఎటువంటి పొరపాట్లు, లోటుపాట్లకు ఆస్కారం లేకుండా పరీక్ష నిర్వహించినట్టు తెలిపారు. విజయవాడలోని పలు పరీక్ష కేంద్రాలను ఆయన పరిశీలించారు.





బందరు ఇంజనీరింగ్ కళాశాల పరీక్షా కేంద్రాన్ని సందర్శించిన జేసీ గీతాంజలి శర్మ

ఏసీబీలో ఐదుగురిపై వేటు

- **ఇద్దరు డీఎస్పీలు, ఇద్దరు ఇన్‌స్పెక్టర్లు, కానిస్టేబుల్ పోలీసుశాఖకు సరెండర్**
- **సబ్‌రిజిస్ట్రార్ ధర్మసింగ్ ఎఫెక్టేనా?**
- **గతేడాది నవంబరు నుంచి పరారీలో సబ్‌రిజిస్ట్రార్**
- **సాధారణ బదిలీలే అంటున్న ఏసీబీ వర్గాలు**



(ఆంధ్రజ్యోతి - విజయవాడ)

ఇద్దరు డీఎస్పీలు, ఇద్దరు ఇన్‌స్పెక్టర్లు, ఒక కానిస్టేబుల్ ఏసీబీలో ఉన్న ఈ ఐదుగురిని ఒకేసారి విధుల నుంచి తప్పించారు. వారిని పోలీసుశాఖకు సరెండర్ చేశారు. ఇప్పుడు ఈ వ్యవహారం ఏసీబీలో చర్చనీయాంశంగా మారింది. జిల్లా ఏసీబీ యూనిట్‌లో ఉన్న డీఎస్పీలు శరత్, శ్రీనివాస్, ఇన్‌స్పెక్టర్లు కృపానందం, శివకుమార్, కానిస్టేబుల్ సురేష్‌ను ఇక్కడి నుంచి పోలీసు విభాగానికి బదిలీ చేశారు. ఈ ఐదుగురినీ ఒకేసారి బదిలీ చేయడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఏసీబీ వర్గాలు మాత్రం సాధారణ బదిలీల్లో భాగంగానే వారిని బదిలీ చేశామని చెబుతున్నాయి. జనవరి నెలలో ఎన్నికల బదిలీలు జరిగాయి. ఒకేచోట మూడేళ్ల నుంచి పనిచేస్తున్న అధికారులను మార్పు చేయాలని ఈసీ ఆదేశించిన విషయం తెలిసిందే. జనవరి 31వ తేదీ నాటికి ఈ బదిలీలు పూర్తి చేయాలని ఆదేశించింది. అన్ని జిల్లాల్లోను ఎన్నికల బదిలీలు పూర్తయ్యాయి. మరికొద్ది రోజుల్లో ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే అవకాశాలు ఉన్నాయి. ఇప్పుడు ఉన్నట్టుండి ఈ ఐదుగురిని ఏసీబీ నుంచి పోలీసు శాఖకు పంపడం గమనార్హం.

ఉన్నత స్థాయిలో విచారణ?

ప్రస్తుతం బదిలీ అయిన ఐదుగురిపై ఏసీబీలోని ఉన్నతాధికారులు విచారణ చేస్తున్నట్టు విశ్వసనీయంగా తెలిసింది. ఈ క్రమంలోనే ఇద్దరు డీఎస్పీలు, ఇద్దరు ఇన్‌స్పెక్టర్లు, కానిస్టేబుల్‌ను పోలీసుశాఖకు సరెండర్ చేసినట్టు సమాచారం. సాధారణ బదిలీలు అయితే వారి స్థానంలో కొత్తవారిని నియమించాలి. ఆ పని ఇక్కడ జరగలేదు. ఐదుగురిని బదిలీ చేస్తే ఒక ఇన్‌స్పెక్టర్‌కు మాత్రమే పోస్టింగ్ ఇచ్చారు. ఆయన ఇంకా బాధ్యతలు స్వీకరించలేదు. ఈ మొత్తం పరిణామాలకు ఇబ్రహీంపట్నం సబ్‌రిజిస్ట్రార్ లాలా బాలనాగ ధర్మసింగ్ కేసే దీనికి ప్రధాన కారణమని తెలుస్తోంది. ధర్మసింగ్‌పై జిల్లా ఏసీబీ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు అందాయని సమాచారం. ఆయన గాంధీనగరంలోని సబ్‌రిజిస్ట్రార్‌గా పనిచేసినప్పుడూ ఈ ఫిర్యాదులు అందినట్టు తెలిసింది. అయినప్పటికీ జిల్లా యూనిట్ అధికారులు ధర్మసింగ్ జోలికి వెళ్లలేదు. దీనితో ధర్మసింగ్ బాధితులు ఏసీబీ సీఐయూ అధికారులను ఆశ్రయించారు. గడచిన ఏడాది నవంబరు 17న సీఐయూ బృందాలు ధర్మసింగ్ ఇంట్లో, కార్యాలయంలో సోదాలు చేయడానికి వెళ్లాయి. అప్పటి వరకు ఇంట్లో ఉన్న ధర్మసింగ్ ఇంటి వెనుక వైపు నుంచి పారిపోయాడు. ఆయన పరారై నాలుగు నెలలు కావస్తున్నా ఇప్పటి వరకు ఏసీబీ అధికారులకు చిక్కలేదు. ఈ పరిణామంతో జిల్లా యూనిట్ అధికారులపై సీఐయూ విభాగానికి కొన్ని అనుమానాలు మొదలైనట్టు సమాచారం. అసలు ఏసీబీ అధికారులు ఇంటి బయట ఉండగానే ఆ విషయం ధర్మసింగ్‌కు ఎలా తెలిసిందన్నది అనుమానం వ్యక్తమైనట్టు సమాచారం. జిల్లా ఏసీబీ నుంచి బదిలీ అయిన ఐదుగురిపై ఉన్నతాధికారులు విచారణ చేస్తున్నట్టు సమాచారం. ఏసీబీ అధికారులు వెళ్లినప్పుడు ధర్మసింగ్ తన ఇంటికి సమీపాన ఉన్న వైసీపీకి చెందిన ప్రజాప్రతినిధికి ఫోన్ చేసినట్టు తెలిసింది. ఆయన సూచనతోనే ధర్మసింగ్ ఇంటి వెనుక నుంచి పారిపోయినట్టు సమాచారం.



దుర్గమ్మకు హాల్ టికెట్లను చూపుతూ వేడుకుంటున్న విద్యార్థులు

దుర్గమ్మా.. ఆశీర్వదించమ్మా

» పరీక్షల ముందు ఆశీస్సులు పొందిన విద్యార్థులు



వన్‌టౌన్, ఫిబ్రవరి 25 : పరీక్షల్లో మంచి మార్కులతో విజయం సాధించేలా ఆశీర్వదించాలని ఇంద్రకీలాద్రిపై కొలువైన కనకదుర్గమ్మను విద్యార్థులు కోరుకున్నారు. ఆదివారం దుర్గగుడికి పెద్దసంఖ్యలో విద్యార్థులు చేరుకుని అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారి సమక్షంలో హాల్‌టికెట్లు ఉంచి పరీక్షలు బాగారాయాలని మొక్కుకున్నారు. మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించేలా ఆశీర్వదించాలని వేడుకున్నారు. మాఘ ఆదివారం సందర్భంగా దుర్గగుడిలో సూర్యనారాయణమూర్తికి ప్రత్యేక అర్చనలు చేశారు. అరుణ పారాయణ, ఆదిత్య హృదయ పారాయణ నిర్వహించారు. సకల ప్రజలకు ఆయురారోగ్యాలను కలగజేయాలని సంకల్పిస్తూ అర్చనలు నిర్వహించారు. ఆదివారం అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు అధికసంఖ్యలో విచ్చేశారు. ఖడ్గమాలార్చన, చండీహోమం, శ్రీచక్రనవారణార్చన, లక్షకుంకుమార్చన, శాంతి కల్యాణం తదితరాలలో పాల్గొన్నారు. విశాఖపట్నం అబిద్‌నగర్‌కు చెందిన కె.వెంకటేశ్వరరావు, జయంతిలు ఆదివారం ఆలయానికి విచ్చేసి ఈవో రామరావుకు లక్ష రూపాయల విరాళం అందజేశారు.



అమ్మవారికి నైవేద్యం సమర్పించేందుకు వెళుతున్న భక్తులు

వీరమ్మ తిరునాళ్లకు పోటెత్తిన భక్తులు

ఉయ్యూరు, ఫిబ్రవరి 25 : వీరమ్మ తిరునాళ్లకు భక్తులు పోటెత్తారు. తిరునాళ్లలో 7వ రోజు, మొదటి ఆదివారం కావడంతో పెద్దసంఖ్యలో తరలివచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం, రహదారులు జనసంద్రంగా మారాయి. రాష్ట్రంలో పలు జిల్లాలు, తెలంగాణా రాష్ట్రం నుంచి భక్తులు వచ్చి అమ్మవారిని దర్శించి మొక్కుతీర్చుకున్నారు. ఎండను సైతం లెక్కచేయక భక్తులు ఆలయం చుట్టూ ప్రదక్షిణలుచేసి, అమ్మవారిని దర్శించుకునేందుకు క్యూలో నిలుచున్నారు. అమ్మవారి దర్శనం అనంతరం వెలుపలికి వచ్చేందుకు ఖాళీలేక పోవడంతో భక్తులు అసౌకర్యానికి గురయ్యారు. పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినప్పటికి భక్తులు పెద్దసంఖ్యలో తరలిరావడంతో ఇబ్బందులు పడ్డారు.

భక్తులతో కిటకిటలాడిన ఆలయ ప్రాంగణం

లక్షలాదిగా తరలివచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసింది. తిరునాళ్ల మొదటి ఆదివారం కావడంతో పలుప్రాంతాల నుంచి భారీసంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారికి పాలపొంగళ్లు వండి నైవేద్యం, చీర సారె, పసుపుకుంకుమ సమర్పించారు. కొబ్బరికాయలు, పసుపుకుంకుమ చీరలు, గాజుల దుకాణాలు కిటకిటలాడాయి. గొర్రె పొటేళ్లు, కోడిపుంజులు, చలువకావిడిలతో డప్పువాయిద్యాల నడుమ మొక్కుబడులు తీర్చుకున్నారు.



సభావేదిక ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్, ఇతర అధికారులు, ఎమ్మెల్యేలు

సీఎం సభ ఏర్పాట్లు పూర్తిచేయండి

» కృష్ణా జిల్లా కలెక్టర్ రాజాబాబు

పామర్రు, ఫిబ్రవరి 25 : నియోజకవర్గ కేంద్రమైన పామర్రు పట్టణం విజయవాడ రోడ్డులోని దేవస్థాన భూముల్లో ఈనెల 29న నిర్వహించనున్న సీఎం జగన్మోహన రెడ్డి సభను విజయవంతం చేయాలని కృష్ణా కలెక్టర్ పి.రాజాబాబు అన్నారు. స్థానిక ప్రైవేట్ కళ్యాణ మందిరంలో ఆదివారం అధికారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జగనన్న విద్యాదీవెన కార్యక్రమాన్ని ఇక్కడి నుంచే సీఎం ప్రారంభిస్తారని చెప్పారు. ఈసందర్భంగా ఏర్పాట్లపై అధికారులకు దిశనిర్దేశం చేశారు. సభాస్థలి ప్రాంగణంతో పాటు, హెలిప్యాడ్ ప్రాంతాలను ఎమ్మెల్యేలు పేర్నినాని, కైలేఅనిల్ కుమార్‌లతో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో జేసీ గీతాంజలిశర్మ ఏఎస్పీ జి.వేంకటేశ్వరరావు, జడ్పీసీఈవో వి.జ్యోతిబసు, హౌసింగ్ పీడీ జీవీ సూర్యనారాయణ, డీఆర్డీఏ పీడీ పిఎస్ఆర్‌ప్రసాద్, ఆర్అండ్‌బీ ఈఈ శ్రీనివాసరావు, విద్యుత్ ఈఈ భాస్కరావు, గుడివాడ, ఉయ్యూరు, బందరు ఆర్డీవోలు పాల్గొన్నారు.



మాజీ మంత్రి కొల్లు రవీంద్రను కలిసిన వైసీపీ కార్పొరేటర్ నాలి శారద భర్త మాధవ

టీడీపీలోకి వైసీపీ కార్పొరేటర్ నాలి శారద

» కొల్లు రవీంద్రను కలిసిన కార్పొరేటర్ భర్త

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 25 : వైసీపీకి నగరంలో మరో షాక్ తగలనుంది. ఇప్పటికే వైసీపీ ఎంపీ వల్లభనేని బాలశౌరి, మాదివాడ రాములు జనసేన పార్టీలోకి వెళ్లిన నేపథ్యంలో మచిలీపట్నం నగరపాలక సంస్థలో అధికార వైసీపీ 40వ డివిజన్ కార్పొరేటర్ నాలి శారద, ఆమె భర్త నాలి మాధవ తన అనుచరులతో తెలుగుదేశం పార్టీలో చేరేందుకు ముందుకువచ్చారు. మాజీ మంత్రి కొల్లు రవీంద్రను మచిలీపట్నం అసెంబ్లీ నియోజక వర్గ టీడీపీ, జనసేన కూటమి అభ్యర్థిగా ప్రకటించిన నేపథ్యంలో కొల్లు రవీంద్రను మచిలీపట్నంలో నాలి మాధవ కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే పేర్ని నాని వైసీపీ నాయకులకు తగిన ప్రాధాన్యత ఇవ్వనందున టీడీపీలో చేరుతున్నట్టు నాలి మాధవ ఆంధ్రజ్యోతికి తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నేత గొర్రెపాటి గోపీచంద్, బందరు రూరల్ అధ్యక్షుడు కుంచే నాని, ఇంజనీర్ మురళీ కృష్ణ తదితరులు ఉన్నారు.

చంద్రబాబు సామాజిక న్యాయం పాటించారు

» టికెట్ల ప్రకటనపై ఎమ్మెల్యే పార్థసారథి



పెనమలూరు, ఫిబ్రవరి 25 : శనివారం ప్రకటించిన టీడీపీ తొలివిడత టికెట్ల విషయంలో చంద్రబాబునాయుడు సామాజిక న్యాయం పాటించారని పెనమలూరు ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి పేర్కొన్నారు. ఆదివారం పోరంకి వందడుగుల రోడ్డులోని పార్టీ కార్యాలయంలో కమ్మ కార్పొరేషన్ మాజీ చైర్మన్ తుమ్మల చంద్రశేఖర్(బుడ్డి), నూజివీడు టీడీపీ పరిశీలకుడు వీరంకి వెంకట గురుమూర్తిలతో కలిసి విలేకరుల సమావేశం లో మాట్లాడారు. గతానికి భిన్నంగా ఎన్నికల నోటిఫికేషన్ ఇవ్వకుండానే చంద్రబాబు, పవన్‌కళ్యాణ్‌లు కలిసి ఏకంగా 99మంది ఉమ్మడి అభ్యర్థులను ప్రకటించడం హర్షించదగ్గ విషయమన్నారు. కోటికి పైగా ప్రజల అభిప్రాయాలు తెలుసుకొని అభ్యర్థుల గుణగణాలు, విద్యార్హతలు, సామాజిక నేపథ్యాలను ఆధారం చేసుకొని టిక్కెట్లు ప్రకటించడం ఆనందకరమన్నారు. దీనికి భిన్నంగా వైసీపీ కొద్దిమంది అభ్యర్థుల ప్రకటనలో గందరగోళం చెలరేగి ఆశావహులు నిరాశకు గురై.. ఎమ్మెల్యేలను బదిలీలు చేయడం తెలిసిందేనన్నారు. కేవలం కొద్దిమంది అగ్రకులాల నాయకులు వ్యతిరేకించి ఎస్సీ, బీసీ ఎమ్మెల్యేల నియోజకవర్గాలను ఏకపక్షంగా మార్చడం వైసీపీకే చెల్లిందన్నారు.

నేడు టీడీపీలో చేరిక

సోమవారం రెండువేల మందితో ర్యాలీగా వెళ్లి మంగళగిరి టీడీపీ కార్యాలయంలో 11.30కు పార్టీలో చేరనున్నట్టు పార్థసారథి తెలిపారు. భారీసంఖ్యలో నియోజకవర్గ అభిమానులు, వైసీపీ శ్రేణులు టీడీపీలో చేరతారని తెలిపారు.

మొదటి జాబితాలో పేరు లేకపోవడం నిరాశ కలిగించింది

» బోడె ప్రసాద్



శనివారం ప్రకటించిన టీడీపీ, జనసేన మొదటి జాబితాలో తన పేరు లేకపోవడం నిరాశ, బాధ కలిగించిందని పెనమలూరు టీడీపీ ఇన్‌చార్జి బోడె ప్రసాద్ వ్యాఖ్యానించారు. ఆదివారం మీడియాతో ఆయన మాట్లాడుతూ, నాలుగున్నరేళ్లుగా పార్టీని కాపాడుకుంటూ పటిష్టపరిచానని, ప్రస్తుతం పెనమలూరులో టీడీపీ తరఫున ఎవరు పోటీచేసినా గెలిచేస్థాయికి తీసుకొచ్చానని పేర్కొన్నారు. చంద్రబాబుపై నమ్మకంతో ఉన్నానని, రెండో జాబితాలో తన పేరు ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. వేరొకరికి టిక్కెట్ ఇస్తే కార్యకర్తల అభీష్టానికి అనుగుణంగా నడుచుకుంటానని తెలిపారు. తనకు న్యాయం జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.



సదస్సులో మాట్లాడుతున్న శ్రీరాం తాతయ్య

దళితుల ద్రోహి జగన్ రెడ్డి

» శ్రీరాం తాతయ్య, కేశినేని చిన్ని

జగ్గయ్యపేట : దళితులకు ద్రోహం చేసి చరిత్రహీనుడిగా ముఖ్యమంత్రి జగన్ నిలిచాడని టీడీపీ, జనసేన జగ్గయ్యపేట అసెంబ్లీ అభ్యర్థి శ్రీరాం తాతయ్య, విజయవాడ పార్లమెంట్ టీడీపీ సీనియర్ నేత కేశినేని చిన్నిలు అన్నారు. దళితులు అధికంగా ఉన్న ప్రాంతంలో రాజధాని నిర్మిస్తుంటే ఓర్వలేని వ్యక్తి జగన్ అని విమర్శించారు. ఆదివారం జగ్గయ్యపేటలో నియోజకవర్గ ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో 'దళితుల పిలుపు-తాతయ్య గెలుపు' ఆత్మీయ సదస్సులో నందిగామ టీడీపీ అభ్యర్థిని తంగిరాల సౌమ్య, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు సొంగ సంజయ్ వర్మ, పుచ్చ విజయకుమార్, దేవతోటి నాగరాజు, జ్యోతిబస్ తదితరులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా తాతయ్య, చిన్నిలు మాట్లాడుతూ, వైసీపీ పాలనలో దళితులకు గతంలో అమలు చేసిన 27 సంక్షేమ పథకాలను రద్దు చేశారని, 150 మందికి పైగా దళితులు హత్యలకు గురయ్యారని అన్నారు. చంద్రబాబు హయాంలో ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ఆర్థిక సహాయం, ఎస్సీ భూముల కొనుగోలు, అంబేడ్కర్ విదేశీ విద్యా పథకం వంటివి ఎన్నో అమలయ్యాయని చెప్పారు. దళితులకు రక్షణ, ఆత్మగౌరవం కలగాలన్నా, ఎస్సీ ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం సక్రమంగా అమలు జరగాలన్నా చంద్రబాబు సీఎం కావాలన్నారు.

భారీగా తరలివచ్చిన దళితులు

జగ్గయ్యపేట అసెంబ్లీ అభ్యర్థిగా శ్రీరాం తాతయ్య పేరు ప్రకటించాక దళితుల ఆత్మీయ సదస్సుకు నియోజకవర్గం నుంచి దళితులు భారీగా తరలివచ్చారు. పట్టణం పసుపుమయంగా మారింది. బైక్ ర్యాలీ, ఎన్టీఆర్ సర్కిల్ మీదుగా సాగింది. 1దళితుల ఆత్మీయ సమ్మేళనంలో గౌరవరం గ్రామం నుంచి 20 కుటుంబాలు కేశినేని చిన్ని సమక్షంలో వైసీపీకి బైబై చెప్పి టీడీపీలో చేరారు.

28న మినీ జాబ్‌మేళా

వన్‌టౌన్, ఫిబ్రవరి 25 : ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 28 వతేదీన ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రాంగణంలో మినీ జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 9 గంటల నుంచి జాబ్‌మేళా ప్రారంభమవుతుందని, ఎస్ఎస్‌సీ, ఇంటర్, డిగ్రీ బీటెక్, ఫార్మసీ, ఐటీఐ డిప్లమా అర్హత కలిగిన అభ్యర్థులు skilluniverse.apssdc.in వెబ్‌సైట్‌లో తమ వివరాలను నమోదు చేసుకోవాలన్నారు. నాలుగు కంపెనీలు పాల్గొంటాయని, కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూల ద్వారా ఉద్యోగాలకు ఎంపిక చేస్తారని తెలిపారు. వివరాలకు 9347779032 నెంబరులో సంప్రదించాలన్నారు.

పారిస్ ఒలింపిక్స్‌కు ధీరజ్

» ఆసియా కప్ ఆర్చరీలో మూడు స్వర్ణాలు



విజయవాడస్పోర్ట్సు, ఫిబ్రవరి 25 : నగరానికి చెందిన యువ ఆర్చర్ బొమ్మదేవర ధీరజ్ పారిస్ ఒలింపిక్స్‌కు బెర్త్ ఖరారు చేసుకున్నాడు. ఇరాక్ రాజధాని బాగ్దాద్‌లో జరుగుతున్న ఆసియాకప్ లీగ్-1 టోర్నీలో స్వర్ణాలతో సత్తాచాటాడు. భారత్‌కు ప్రాతినిధ్యం వహించిన ధీరజ్ తొలిసారిగా రికర్వ్ విభాగంలో పురుషుల విభాగంలో స్వర్ణం వశం చే సుకున్నాడు. రికర్వ్ టీమ్ ఈవెంట్‌లో ధీరజ్, తరుణ్‌దీప్, ప్రవీణ్ రమేష్ జాదవ్‌లతోను, రికర్వ్ మిక్స్‌డ్ ఈవెంట్‌లో సిమ్రన్ జీత్‌లతో కలిసి రెండు స్వర్ణాలను ధీరజ్ తన ఖాతాలో వేసుకున్నాడు. ఓల్గా ఆర్చరీ అకాడమీలో ప్రధాన కోచ్, ఏపీ ఆర్చరీ అసోసియేషన్ కార్యదర్శి చెరుకూరి సత్యనారాయణ వద్ద ధీరజ్ శిక్షణ పొందుతున్నాడు. ప్రథమ ర్యాంకర్‌గా కొనసాగుతూ పారిస్ బెర్త్‌ను సాధించడం అభినందనీయమని ఉమ్మడి కృష్ణాఆర్చరీ అసోసియేషన్, కోచ్ చెరుకూరి సత్యనారాయణలు ధీరజ్‌ను అభినందించారు.

అక్రమార్కులకు అధికారుల అండ!

- **రొయ్యూరు క్వారీలో ఇసుక తరలింపు షురూ..**
- **కేసుల భయంతో వెనక్కి తగ్గిన స్థానికులు**

తోట్లవల్లూరు, ఫిబ్రవరి 25 : రొయ్యూరులో ఇసుక క్వారీకి అధికారులు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో ఆదివారం రాత్రి నుంచి తవ్వకాలు తిరిగి ప్రారంభమయ్యాయి. శుక్రవారం అర్ధరాత్రి గ్రామస్థులు ట్రాక్టర్లను అడ్డుపెట్టి ఇసుక తవ్వకాలను అడ్డుకున్న విషయం తెలిసిందే. శనివారం రాత్రి వరకు క్వారీని నడవకుండా ప్రజలు అడ్డుకున్నప్పటికీ క్వారీ నిర్వాహకులుగాని, అధికారులుగాని స్పందించలేదు. శనివారం రాత్రి తహసీల్దార్ ఎం.కుసుమకుమారి, ఎస్సై పి.విశ్వనాథ్ రొయ్యూరు వచ్చి గ్రామస్తులతో చర్చలు జరిపారు. రోడ్డును బాగుచేస్తారని, గ్రామంలోని ట్రాక్టర్లకు రూ. 1200లకు ఇసుక ఇస్తారని అధికారులు క్వారీ నిర్వాహకులను ఒప్పించారు. శాంతి భద్రతల సమస్య ఎదురైతే కేసులు నమోదు చేస్తామని ఎస్సై చెప్పటంతో ప్రజలు వెనక్కి తగ్గారు. దాంతో ఆదివారం యధావిధిగా క్వారీని తెరిచి ఇసుక తవ్వకాలు చేపట్టారు. క్వారీలో పర్యావరణ విధ్వంసం జరుగుతున్నా స్పందించని అధికారులు గ్రామస్థులతో చర్చలు జరపటం తీవ్ర విమర్శలకు దారితీసింది. మంత్రి, ఎమ్మెల్యేల ఆదేశాలతోనే క్వారీకి గుడ్డిగా అనుమతి ఇచ్చారని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

రైతులను నమ్మించి నట్టేటముంచిన వైసీపీ ప్రభుత్వం

» యార్లగడ్డ వెంకట్రావు



హనుమాన్‌జంక్షన్‌రూరల్, ఫిబ్రవరి 25 : ఆరుగాలం శ్రమించి పండించిన ధాన్యం ఆర్బీకేల ద్వారా కొనుగోలు చేసి నెలలు గడుస్తున్నా నగదు చెల్లించకపోవడం రైతులను నమ్మించి మోసం చేయడమేనని టీడీపీ-జనసేన గన్నవరం ఉమ్మడి అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. ఆరుగొలనులో తెలుగురైతు జిల్లా ఉపాధ్యక్షుడు మొవ్వా వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన రహదారి దిగ్బంధనం, నిరసనసభలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మిచౌంగ్ తుపాను ధాటికి జిల్లా వ్యాప్తంగా 3.5లక్షల ఎకరాల్లోని పంట నష్టపోతే ఇంతవరకూ ప్రభుత్వం స్పందించలేదని, క్రాప్ ఇన్సూరెన్స్ బకాయిలు కూడా చెల్లించకపోవడం వైసీపీ ప్రభుత్వ చేతకానితనం కాదా అని ప్రశ్నించారు. టీడీపీ హయంలో రంగుమారిన, ముక్కిపోయిన ధాన్యం కూడా కొన్న వెంటనే రైతులకు చెల్లింపులు చేసి రైతులకు అండగా నిలిచిందన్నారు. ధాన్యం సొమ్ములు తక్షణం విడుదల చేసి రైతులను ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. టీడీపీ, జనసేన శ్రేణుల్లో సహనం నశిస్తే జరిగే విపత్కర పరిణామాలకు పోలీసులే బాధ్యత వహించాల్సి ఉంటుందని యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. ఆరుగొలనులో నిరసన కార్యక్రమంలో పోలీసులు అడ్డుతగలడంతో తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. రక్షణ కల్పించాల్సిన పోలీసులే దుర్మార్గంగా వ్యవహరిస్తూ ప్రెస్‌మీట్‌లు పెట్టి టీడీపీ నాయకులపై కేసులు పెట్టడం దౌర్భాగ్యమన్నారు. కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షుడు బేతా శేషకుమార్, మండల అధ్యక్షుడు దయాల రాజేశ్వరరావు, పుట్టా సురేష్, దొంతు చిన్నా, భారీ సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

టీడీపీలో సమరోత్సాహం!

(5వ పేజీ తరువాయి)

సేవా కార్యక్రమాలతో వెనిగండ్లకు సానుకూలత

గుడివాడ టీడీపీ అభ్యర్థి వెనిగండ్ల రాము ఏడాదిన్నరగా స్థానికంగా ఉంటూ టీడీపీ బలోపేతానికి పనిచేస్తున్నారు. సేవా కార్యక్రమాల ద్వారా ప్రజల్లో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. ఇక్కడ జనసేన నాయకులు, టీడీపీ నాయకులు కలిసి పనిచేస్తుండటంతో ఈసారి జరిగే ఎన్నికల్లో టీడీపీకి అనుకూలంగా పరిస్థితులు మారుతాయనే ప్రచారం ఇటీవల కాలంలో అధికమైంది. గుడివాడ నియోజకవర్గంలో కాపుసామాజిక వర్గం ఓటర్లు 35వేల మందికిపైగా ఉన్నారు. ఈ సామాజిక వర్గంలోని ఒకరిద్దరు నాయకులు తప్ప మిగిలిన వారంతా కొడాలి నానికి దూరంగా ఉంటున్నారు. జనసేన, టీడీపీ కలయికలో కాపుసామాజిక వర్గం ఓటు బ్యాంకు టీడీపీకే మేలు చేస్తుందనే చర్చ నడుస్తోంది.

వైసీపీ అవినీతి అక్రమాలే కాగితకు బలం

పెడన నియోజకవర్గం టీడీపీ అభ్యర్థిగా కాగిత కృష్ణ ప్రసాద్ పోటీ చేయనున్నారు. గత ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా పోటీచేసి ఆయన స్వల్ప ఓట్ల తేడాతో ఓటమిపాలయ్యారు. పెడన నియోజకవర్గం నుంచి వైసీపీ తరఫున ఎమ్మెల్యేగా ఎన్నికైన జోగి రమేష్ నియోజకవర్గంలో చేసిన అక్రమాల కారణంగా ఆయనను ఈ నియోజకవర్గం నుంచి పోటీ చేయకుండా వైసీపీ అధిష్ఠానం బయటకు పంపేసింది. మంత్రి జోగి రమేష్, ఆయన అనుచరులు సొంత పార్టీ నాయకులతోపాటు ఎవ్వరినీ వదలకుండా అక్రమాలకు పాల్పడంతో నియోజకవర్గంలో వైసీపీ పట్ల అసంతృప్తి తీవ్రమైంది. ఆయన ఈ నియోజకవర్గం నుంచి వెళ్లిపోయినా గతంలో చేసిన అక్రమాలు ఆపార్టీపై ప్రభావం చూపడం ఖాయంగా కనిపిస్తోంది.

వైసీపీ ఎంపీ అభ్యర్థి ఎవరో?

మచిలీపట్నం పార్లమెంటు నియోజకవర్గ వైసీపీ అభ్యర్థి విషయంలో నెలకొన్న సందిగ్ధతపై ఇంకా వీడలేదు. అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబును మచిలీపట్నం ఎంపీ అభ్యర్థిగా ప్రకటించినా ఆయన ఏ నియోజకవర్గంలోనూ ఇంతవరకు పర్యటించలేదు. ఆయన పోటీ చేసే అవకాశాలు తక్కువగా ఉన్నాయని ప్రచారం జరుగుతోంది. గతంలో మచిలీపట్నం పార్లమెంటు సభ్యుడిగా పనిచే సిన బాడిగ రామకృష్ణ వైసీపీ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తారని రెండు, మూడు రోజులుగా ప్రచారం జోరందుకుంది. దీనిపై ఆ పార్టీ నుంచి అధికారిక ప్రకటన లేదు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	159, 168, 179
చికెన్ విత్ స్కిన్	308
చికెన్ స్కిన్‌లెస్	316

నెక్ కోడిగుడ్డు ధర
విజయవాడ జోన్ రైతు ధర రూ. 4.90

ఉపాధి హామీ మస్తర్లు పక్కాగా ఉండాలి

ఉంగుటూరు, ఫిబ్రవరి 25 : ఉపాధిహామీ పథకం ద్వారా గ్రామాల్లో జరుగుతున్న పలు అభివృద్ధి పనులకు సంబంధించిన రికార్డులు, రిజిష్టర్లు, కూలీల మస్తర్లలో దిద్దుబాట్లు లేకుండా పక్కాగా వుండాలని డీఆర్పీలు ఎం.నాగరాజు, ఎన్.గోపి ఉపాధిహామీ సిబ్బందికి సూచించారు. మండలంలోని ఆముదాలపల్లి, లంకపల్లి గ్రామాల్లో 2022-23 ఆర్థిక సంవత్సరం జరిగిన ఉపాధి పనులపై ఆదివారం సామాజిక తనిఖీ గ్రామసభలు నిర్వహించారు. తనిఖీ అధికారులు ఆయా గ్రామాల్లో పర్యటించి జరిగిన పనులపై కూలీల నుంచి వివరాలు సేకరించారు. ఈ కార్యక్రమంలో ఆముదాలపల్లి, లంకపల్లి సర్పంచ్‌లు డొక్కు వెంకట రమణమ్మ, కాకుల సుజాత, ఏపీవో టి.వినీల, స్వతంత్ర పరిశీలకులు డాక్టర్ చింతల మల్లిబాబు, ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్లు, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

వీరమ్మను దర్శించుకున్న వైవీబీ



వీరమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న వైవీబీ రాజేంద్రప్రసాద్

ఉయ్యూరు, ఫిబ్రవరి 25 : వీరమ్మ తిరునాళ్లలో అమ్మవారిని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వైవీబీ రాజేంద్రప్రసాద్ ఆదివారం దర్శించుకొని పూజలు చేశారు. ఆలయ కమిటీ ఆయనకు ఘన స్వాగతం పలికి అమ్మవారి పసుపు కుంకుమ అందజేశారు. ఉయ్యూరు ప్రజల ఇలవేల్పు వీరమ్మతల్లి తిరునాళ్ల 15 రోజులపాటు ఘనంగా నిర్వహించడం శుభసూచకమని, చల్లని తల్లి దయతో అందరూ సుఖసంతోషాలు అష్టఐశ్వర్యాలతో తులతూగుతూ ఆంధ్రప్రదేశ్ అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని అమ్మవారిని కోరుకున్నట్టు తెలిపారు. టీడీపీ నగర సాధికార రాష్ట్ర కన్వీనర్ జంపన వీరశ్రీనివాస్, బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి రాజులపాటి ఫణి తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు.

ప్రశాంతంగా గ్రూప్-2 పరీక్ష



పరీక్షా కేంద్రాల వద్ద బందోబస్తు

ఉయ్యూరు, ఫిబ్రవరి 25 : ఉయ్యూరులో ఆదివారం గ్రూప్-2 పరీక్ష ప్రశాంతంగా జరిగింది. ఏజీ అండ్ ఎస్ జీ ఎస్ కళాశాల, శ్రీశ్రీనివాస కళా శాల, నారాయణ కళాశాల, ఫ్లోరా స్కూల్‌లో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. నిర్ణీత సమయాకి ముందే అభ్యర్థులు పరీక్షా కేంద్రాలకు చేరుకోగా పోలీసులు, సిబ్బంది అభ్యర్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసి కేంద్రంలోనికి అనుమతించారు. దూర ప్రాంతాలనుంచి వచ్చిన అభ్యర్థులకు పరీక్ష కేంద్రాలు తెలియక ఇబ్బంది పడ్డారు. కేంద్రాల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా 144వ సెక్షన్ అమలు చేసి సీఐ హబీబ్ బాషా, పోలీసు సిబ్బంది గట్టి బందోబస్తు నిర్వహించారు.

రాణమ్మతల్లికి ప్రత్యేక పూజలు

హనుమాన్‌జంక్షన్, ఫిబ్రవరి 25: స్థానిక నూజివీడు రోడ్డులోని రాణమ్మ తల్లి ఆలయంలో మాఘ పౌర్ణమి సందర్భంగా మారెమ్మ తల్లికి ఆదివారం ప్రత్యేకపూజాలు నిర్వహించారు. రాణమ్మ తల్లితో పాటు మారెమ్మ తల్లిని అధిక సంఖ్యలో భక్తులు సందర్శించి పూజలు, మొక్కుబడులు, నైవేద్యాలు సమర్పించారు. ఈ సందర్భంగా 1500 మంది భక్తులకు ఆలయ నిర్వాహకులు అన్నే రాంబాబు అన్న సంతర్పణ చేశారు.

కొయ్యూరు దేవాలయంలో..

హనుమాన్‌జంక్షన్‌రూరల్ : ఆలయాలను శక్తి కేంద్రాలుగా తీర్చిదిద్దుతూ, ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు సామూహికహారతి లాంటి ధార్మిక కార్యక్రమాలు నిర్వహించాలని సబ్ డివిజన్ ధర్మప్రచారక్ యడవల్లి పాండురంగారావు అన్నారు. కొయ్యూరులోని దేవాలయంలో మాఘపౌర్ణమి సందర్భంగా సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం రాత్రి సామూహిక హారతి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ కన్వీనర్ కేశవరావు, భక్తి బృంద సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

ప్రసాదాల పంపిణీ

ఉయ్యూరు, ఫిబ్రవరి 25 : వీరమ్మ తిరునాళ్లలో ఆదివారం భక్తులకు స్వచ్ఛంద సంస్థలు, సంఘాలు ప్రసాదం పంపిణీ చేశాయి. వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో 5 వేల మందికిపైగా భక్తులకు పులిహోర, శనగలు, చక్కెర పొంగలి పంపిణీ చేశారు. పూర కిషోర్, పూర నాగిన్, యండూరి నాగేశ్వరరావు, చిట్టూరి నాగేశ్వరరావు, వెంట్రప్రగడ గోపి, నాగభూషణరావు తదితరులు సేవలందించారు.

రాష్ట్రాభివృద్ధి టీడీపీతోనే సాధ్యం

గన్నవరం అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావు



టీడీపీలో చేరిన వైసీపీ కార్యకర్తలతో యార్లగడ్డ వెంకట్రావు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, ఫిబ్రవరి 25 : యువత భవిష్యత్తు, రాష్ట్రాభివృద్ధి టీడీపీతోనే సాధ్యమని, ఈ విషయం నమ్మిన ప్రజలు పార్టీవైపు ఆకర్షితులవడం అభినందనీయమని టీడీపీ-జనసేన అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. ఆరుగొలనులో వైసీపీకి చెందిన పలువురు కార్యకర్తలు టీడీపీలోకి చేరడంతో, గ్రామ కమిటీ అధ్యక్షుడు బేతా శేషు కుమార్, పీఎసీఎస్ మాజీ అధ్యక్షుడు తుమ్మల బ్రహ్మాజీ ఆధ్వర్యంలో కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. గ్రామానికి చెందిన వైసీపీ కార్యకర్తలు కర్రా కిషోర్, వంపుగడ థామస్, ఇంటి రాజేష్, ఉప్పులేటి ప్రసాద్ తదితరులు టీడీపీలో చేరారు. అనంతరం ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రగాయా లపాలై ఇంటివద్ద ఉన్న మాజీ సర్పంచ్ గండి కృష్ణారావును పరామర్శించి ఆరోగ్యం గురించి ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకుడు మూల్పూరి వెంకటరత్నం, మండల అధ్యక్షుడు దయాల రాజేశ్వరరావు, వేములపల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రజల కోసమే టీడీపీ, జనసేన పొత్తు

గన్నవరం : రాష్ట్రంలోని ప్రజల సంక్షేమం కోసం, మెజారిటీ ప్రజల కోరిక మేరకు టీడీపీ, జనసేన పార్టీలు రానున్న ఎన్నికల్లో పొత్తు పెట్టుకున్నాయని టీడీపీ గన్నవరం ఇన్‌చార్జి యార్లగడ్డ వెంకట్రావు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలోని కోటి మూడు లక్షల 33వేల మంది ప్రజల అభిప్రాయాలు తీసుకుని రెండు పార్టీలు బలమైన అభ్యర్థులను ప్రకటించాయని, తెలుగుదేశం, జనసేన ప్రకటించిన జాబితాను చూసి వైసీపీ నాయకులకు వెన్నులో వణుకు మొదలైందని విమర్శించారు. ప్రస్తుతం రాష్ట్రంలో వైసీపీకి అభ్యర్థులు కరువయ్యారని, ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు దొరక్క వైసీపీ నాయకులు నానా తంటాలు పడుతున్నారని, వైసీపీ నాయకులకు, మంత్రులకు ఓటమి భయం వెంటాడుతుందని, దీపం ఉండగానే ఇళ్లు చక్కదిద్దుకుందాం అన్నచందంగా తమ అనుయులకు ప్రభుత్వ భూములు దోచిపెడుతున్నారని ఆరోపించారు. వైసీపీ ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీలను తీవ్రంగా అణగదొక్కగా తమ పార్టీ వారికి సముచితస్థానం కల్పించిందని, తమ పార్టీల ఉమ్మడి అభ్యర్థుల్లో 19 మంది ఎస్సీ, ఎస్టీలకు స్థానం కల్పించినట్లు యార్లగడ్డ వివరించారు.

కష్టపడే వారికి పార్టీలో గుర్తింపు

- చంద్రబాబుపై పూర్తి విశ్వాసముంది
- మాజీ ఎమ్మెల్యే బోడె ప్రసాద్



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బోడె ప్రసాద్

మంతెన (కంకిపాడు), ఫిబ్రవరి 25 : చంద్రబాబు నాయుడుపై తనకు పూర్తి విశ్వాసముందని, కష్టపడిన వారికి పార్టీలో గుర్తింపు ఎప్పుడూ ఉంటుందని మాజీ ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. మండలంలోని మంతెన గ్రామంలో ఏర్పాటు చేసిన తెలుగుదేశం పార్టీ కార్యాలయాన్ని ఆయన ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా బోడె ప్రసాద్ మాట్లాడుతూ, తెలుగుదేశం పార్టీ ప్రకటించిన మొదటి జాబితాలో తన పేరు లేకపోవడంతో తనతో పాటు నియోజకవర్గంలోని అనేక గ్రామాల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు ఫోన్లు చేశారన్నారు. సమీ కరణలో భాగంగా పేరు ప్రకటించటంలో ఆలస్య మైందే తప్ప మరో కారణం లేదన్నారు. చంద్రబాబు నాయుడుపై తనకు పూర్తిస్థాయిలో విశ్వాసముందన్నారు. నియోజకవర్గంతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని నియోజకవర్గాల్లో తెలుగుదేశం పార్టీ బలంగా ఉందని తెలియజేశారు. పెనమలూరు నియోజకవర్గంలో కూడా నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ పార్టీ బలోపేతానికి విశేషంగా కృషి చేయడం జరిగిం దని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ మాజీ సభ్యుడు గొంది శివరామకృష్ణ, మాదు సుబ్రహ్మణ్యం, సెంగెపు రంగారావు, కొండవీటి శివయ్య, కుటుంబరావు, రాధాకృష్ణ, మోహన్‌రావు, ఎన్.రమేష్, కాజా బ్రహ్మాజీ, కర్రె శ్రీనివాస్, బాదల నాని, నాని, అన్నవరపు శివపార్వతి, దండమూడి లక్ష్మీ, యార్లగడ్డ రాజా, పొనుగుమాటి బాల, జుజ్జవరపు సురేష్, జనసేన పార్టీ నాయకులు ముప్పా రాజా, రామిశెట్టి గోపాలకృష్ణ, కొడపల్లి వినోద్, పొలుగుమాటి రవి, సనగల సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

దొంగ ఓట్లపై జాగ్రత్తగా వ్యవహరించాలి

ఉయ్యూరు : ఓటర్ల జాబితాలో తప్పొప్పులు, దొంగ ఓట్లపై పార్టీ నాయకులు ప్రత్యేక శ్రద్ధ వహించి జాగరుకతతో వ్యవహరించాలని టీడీపీ పెనమలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి బోడె ప్రసాద్ అన్నారు. పార్టీ కార్యాలయంలో ఆదివారం ఉయ్యూరు పట్టణ పరిధిలో 9వ క్లష్టర్, యూనిట్, బూత్ కన్వీనర్లతో భవిషత్తు కార్యాచరణ, ఓటర్ల జాబితాపై చర్చించి పలు సూచనలు చేశారు. పట్టణ అధ్యక్షుడు జంపాన గుర్నాధరావు, క్లష్టర్ ఇన్‌చార్జ్ కూనపరెడ్డి వాసు, యూనిట్, బూత్ ఇన్‌చార్జ్‌లు పాల్గొన్నారు.

ఆరు గ్యారెంటీలపై ప్రచారం చేయండి

మద్దూరు (కంకిపాడు) : ప్రజా శ్రేయస్సు కోసం చంద్రబాబు నాయుడు ప్రకటించిన ఆరు గ్యారెంటీలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకు వెళ్లాల్సిన అవసరముందని మాజీ ఎమ్మెల్యే బోడె ప్రసాద్ కుమారుడు బోడె వెంకట్‌రామ్ అన్నారు. మండలంలోని మద్దూరులో ఆదివారం నిర్వహించిన బాబు ష్యూరిటీ- భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరుగుతూ, చంద్రబాబు నాయుడు ప్రవేశ పెట్టిన ఆరు గ్యారెంటీలను ప్రజలకు వివరించారు. రాష్ట్రం అభివృద్ధి జరగాలంటే ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ గొంది శివరామకృష్ణ, గ్రామ పార్టీ అధ్యక్షుడు యనమదల మదన్‌మోహన్, వల్లే నరసింహరావు, మన్నే వాసు, యనమదల చిన్ని, పామర్తి నాని, తీట్ల మధు, ఆరేపల్లి గోపి, జుజ్జవరపు శ్రీను, వీరంకి బాలకృష్ణ, సజ్జా శ్రీను, ఈడే రఘు తదితరులు పాల్గొన్నారు.



మద్దూరులో నిర్వహించిన బాబు ష్యూరిటీ- భవిష్యత్ గ్యారెంటీలో బోడె వెంకట్‌రామ్

బెల్టుషాపు నిర్వాహకుడి అరెస్టు

కంకిపాడు, ఫిబ్రవరి 25 : బెల్టుషాపు నిర్వాహకులపై కఠినంగా వ్యవహరిస్తామని ఎస్సై డి. సందీప్ అన్నారు. మండలంలోని ఈడుపుగల్లు గ్రామ పరిధిలో బెల్టుషాపు నిర్వాహకుడు మాదు రవిని అదుపులోకి తీసుకొని మీడి యా ముందు హాజరుపరిచారు. ఈ సందర్భంగా సందీప్ మాట్లాడుతూ, ఈడుపుగల్లులో ఆదివారం ఉదయం దాడులు నిర్వహించగా మాదు రవి అనే బెల్టు షాపు నిర్వాహకుడిని అదుపులోకి తీసుకున్నామన్నారు. అయన వద్ద నుంచి 20 మద్యం సీసాలు స్వాధీన పరుచుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై సందీప్ తెలిపారు.

మానవతకు రూ.35వేల వితరణ

హనుమాన్‌జంక్షన్, ఫిబ్రవరి 25 : మానవత నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలను అభినందిస్తూ ఆర్థిక సహకారం అందించడానికి దాతలు ముందుకు రావడం అభినందనీయమని మానవత రాష్ట్ర అధ్యక్షుడు మారు బోయిన కోటేశ్వరరావు అన్నారు. ఆదివారం మానవత హనుమాన్‌జంక్షన్ శాఖకు పలువురు దాతలు రూ.35,116లు విరాళాలు అందించారు. ఉయ్యూరుకు చెందిన పగడాల వెంకటరామకృష్ణ రూ.5వేలు, రాజమహేంద్రవరానికి చెందిన వెటర్నరీ ఉద్యోగి ఎస్.ఎస్.సోమయాజులు రూ.5 వేలు, బాపులపాడు గ్రామవాసి జట్టి సుబ్బారావు రూ.5,116లు, హైదరాబాద్‌కు చెందిన రిటైర్డు ఉద్యోగి ములగాల శివరాం రూ.10వేలు, రాజమహేంద్రవరం రిటైర్డు ఉద్యోగి మోటూరు రామకోటేశ్వరరావు రూ.10వేలు విరాళాలను అందజేశారు. మానవత జంక్షన్ శాఖ అధ్యక్ష కార్యదర్శులు కూరెళ్ల సుభాచారి, కళ్లేపల్లి నారాయణరావు, సభ్యులు చెక్కా సుబ్బారావు, వడ్డిరాజేశ్వరరావు, జేవీవీ.సత్యనారాయణ, పీవీఎస్. చలం, కొట్నాని రామచంద్రరావు, గంటా సత్యనారాయణ పాల్గొన్నారు.



మానవతకు విరాళాన్ని అందిస్తున్న దాతలు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక



గన్నవరం బాలుర జడ్పీ హైస్కూల్ పూర్వ విద్యార్థులు

గన్నవరం, ఫిబ్రవరి 25 : వాళ్లందరూ ఐదు పదుల వయస్సు పైబడిన వారే. వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన వారిని గన్నవరం బాలుర జడ్పీహైస్కూల్ 40ఏళ్ల తరువాత కలిపింది. ఆ హైస్కూల్‌లో 1984-85 సంవత్సరంలో 10వ తరగతి పూర్తి చేశారు. వీరి ఆత్మీయ కలయిక ఆదివారం కేసరపల్లి జాస్తి చంద్రమౌళి కళ్యాణ మండపంలో ఉత్సాహంగా జరిగింది. సుదీర్ఘ కాలం తర్వాత కలుసుకున్న వారంతా ఒకరినొకరు ఆలింగనం చేసుకుని తమ విద్యార్థి జీవితంలోని అనుభవాలను, సంఘటనలను నెమరవేసుకున్నారు. ఆనాడు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను గుర్తు చేసుకున్నారు. గురువులు నేర్పిన సంస్కారం, క్రమశిక్షణతోనే దేశ విదేశాల్లో స్థిరపడి తమ జీవితాలను మలుచుకుని ఆనందంగా ఉంటున్నామని చెప్పుకున్నారు. వారితో పాటు చదివి అకాల మరణం చెందిన 12మంది మిత్రు లను జ్ఞాపకం చేసుకుని నివాళులర్పించారు.

సందడిగా ముస్తాబాద జడ్పీ హైస్కూల్ పూర్వ విద్యార్థుల కలయిక

మండలంలోని ముస్తాబాద జడ్పీ హైస్కూల్ 1991-92పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక ఆదివారం సందడిగా జరిగింది. పాఠశాలలో తరగతి గదులలోకి వెళ్లి ఆనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. 10వ తరగతిలో ఎవరెవరు ఏ బెంచీలో కూర్చున్నారో చెప్పుకుంటూ ఆనందం వ్యక్తం చేశారు. 25ఏళ్ల తరువాత కలుసుకున్న వారందరు వారి యోగక్షేమాలు తెలుసుకున్నారు. పాఠశాల ప్రాంగణాన్ని కలయతిరిగారు. అప్పటికి ఇప్పటికి పాఠశాల ఎంతో మారిపోయిందని ముచ్చటించుకున్నారు. ఆనాటి గురువులను గుర్తు చేసుకున్నారు. డ్రాయింగ్ మాస్టర్ లక్ష్మణ్ బాబును దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు.

హెచ్‌ఐవీపై అవగాహన

ఉంగుటూరు, ఫిబ్రవరి 25 : హెచ్‌ఐవీ, ఎయిడ్స్‌పై ప్రతి ఒక్కరికీ అవగాహనతో కూడిన అప్రమత్తత ఎంతో అవసరమని పొట్టిపాడు సర్పంచ్ కత్తుల జ్యోతి అన్నారు. జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో జానపద కళారూపాల బృందం ఆదివారం మండలంలోని పొట్టిపాడులో హెచ్‌ఐవీ, ఎయిడ్స్‌కు తీసుకోవాలిసిన జాగ్రత్తల గురించి వీధినాటిక ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. హెచ్ ఐవీ సోకినా భయపడాల్సిన పనిలేదని, మందులతో సాధారణ జీవితం గడపవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో కళాజాత బృంద సభ్యులు ఎం.శేఖర్‌బాబు, వీరయ్య, రవితేజ, ఎం.చిరంజీవి, ఎం.ప్రసాద్, ఎం.కుమార్ పాల్గొన్నారు.

రైతు ఉద్యమానికి సంఘీభావంగా
నేడు ట్రాక్టర్, బైక్ ర్యాలీ

గన్నవరం, ఫిబ్రవరి 25 : రైతుల సమస్యల పరిష్కారం కోసం ఢిల్లీలో జరుగుతున్న రైతు ఉద్యమానికి సంఘీభావంగా సోమవారం గన్నవరం పట్టణంలో ట్రాక్టర్, బైక్ ర్యాలీ నిర్వహిస్తున్నట్టు రైతు సంఘం జిల్లా కార్య నిర్వాహక కార్యదర్శి ముక్కామల ఉమామహేశ్వరరావు తెలిపారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ, డబ్ల్యూటీవో నుంచి వ్యవసాయాన్ని దూరంగా ఉంచాలన్నారు. ఆహార భద్రతను కాపాడి రైతు లను రక్షించాలన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రైతాంగ సమస్యలను పరిష్కరించకుండా మోసం చేస్తుందన్నారు. రైతులకు ఇచ్చిన హామీలను విస్మరించిన కేంద్రానికి ఎన్నికల్లో తగిన గుణపాఠం తప్పదని హెచ్చరించారు. రైతు నాయకులు సూరగాని సాంబశివరావు, కాట్రగడ్డ రామచంద్రజోషి, మల్లంపల్లి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

పోరాటాలతో హక్కుల సాధన

అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు బేబీరాణి



అంగన్వాడీ వర్కర్స్ అభినందన సభలో మాట్లాడుతున్న బేబీరాణి

ఉయ్యూరు, ఫిబ్రవరి 25 : ప్రభుత్వం ఎన్ని ఆటంకాలు సృష్టించి బెదిరించినా, 42 రోజులపాటు సుదీర్ఘ ఉధృత పోరాటంతో ప్రభుత్వం మెడలు వంచి, హక్కుల సాధనలో ఫలితాలు సాధించామని అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు బేబీరాణి అన్నారు. స్థానిక నాగళ్ల రాజేశ్వరమ్మ, జానకీ రామయ్య విజ్ఞాన కేంద్రంలో జిల్లా యూనియన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన అభినదన సభలో ఆమె పాల్గొని మాట్లాడారు. హక్కుల సాధనకు అలుపెరుగని పోరాటం వల్ల విజయం సాధ్యమవుతుందనడానికి అంగన్వాడీ పోరాటం నిదర్శనంగా నిలుస్తుందన్నారు. సమ్మె సందర్భంగా అనేక ఇబ్బందులు ఎదుర్కొన్న నాయకులకు అభినందనలు తెలియజేస్తున్నట్టు తెలిపారు. సీఐటీయూ, ఇతర ప్రజా సంఘాల మద్దతు, సంఘీభావాలతో సఫలీకృతులమయ్యామని, సమాజంలో అన్ని వర్గాలు తమ న్యాయమైన డిమాండ్లకు మద్దతు పలికాయన్నారు. లబ్ధిదారులు కూడా నైతిక మద్దతు తెలపడం తమ సమ్మెకు మరింత బలాన్ని చేకూర్చిందన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి రమాదేవి అన్నారు. జిల్లా నాయకురాలు జ్యోతి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు చౌటపల్లి రవి, తాడంకి నరేశ్, బి రాజేశ్, కీర్తి, ధనశ్రీ, పోలినాయుడు తదితరులు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	159, 168, 179
చికెన్ విత్ స్కిన్	308
చికెన్ స్కిన్‌లెస్	316

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 4.90

వేదవ్యాస్‌కు మాజీ ఎంపీ బాడిగ రామకృష్ణ పరామర్శ



మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 25 : అస్వస్థతకు గురైన టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ డిప్యూటీ స్పీకర్ బూరగడ్డ వేదవ్యాస్‌ను ఆదివారం మాజీ ఎంపీ బాడిగ రామకృష్ణ పరామర్శించారు. మాజీ మంత్రి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు కొల్లు రవీంద్ర కూడా ఆయనను పరామర్శించారు వేదవ్యాస్‌ను బాడిగ రామకృష్ణ పరామర్శించడానికి వచ్చినప్పటికీ రాజకీయంగా చర్చనీయాంశమయింది. బాడిగ రామకృష్ణ మచిలీపట్నం వైసీపీ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తారన్న ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో వేదవ్యాస్‌ను కలవడం చర్చనీయాంశంగా మారింది.

రంగా ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలి



వంగవీటి రంగా విగ్రహావిష్కరణలో రాధా, ఎంపీ బాలశౌరి తదితరులు

నాగాయలంక : వి.ఎం.రంగాఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని నేతలు పిలుపునిచ్చారు. టి.కొత్తపాలెం గ్రామంలో రంగా యువసేన, రాధా - రంగా మిత్ర మండలి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దివంగత మాజీ ఎమ్మెల్యే వంగవీటి మోహన రంగా విగ్రహాన్ని ఎంపీ వల్లభనేని బాలశౌరి, మాజీ ఎమ్మెల్యే వంగవీటి రాధాకృష్ణ, ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు, జనసేన నేతలు బండ్రెడ్డి రామకృష్ణ, చిలకలపూడి పాపారావు తదితరులు ఆవిష్కరించారు. మెండు లక్ష్మణరావు, బావిరెడ్డి వెంకటేశ్వరరావు, హరి, గుడివాక శివరావు, యాసం చిట్టిబాబు, బండ్రెడ్డి నాగమల్లేశ్వరరావు, భోగాది సోమశేఖరరావు తదితరులు పాల్గొన్నారు. తొలుత రాధా - రంగా మిత్ర మండలి, కాపు యువత ఆధ్వర్యంలో నాగాయలంక నుంచి టి.కొత్తపాలెం వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు.

కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిత్వానికి రిజ్వాన్ దరఖాస్తు

చల్లపల్లి : రానున్న సార్వత్రిక ఎన్నికల్లో అవనిగడ్డ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా బరిలో నిలిచేందుకు ఖరారు చేయాలని కోరుతూ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మీర్ రిజ్వాన్ పీసీసీకి దరఖాస్తు చేశారు. విజయవాడ ఆంధ్రరత్న భవన్‌లో కాంగ్రెస్ పార్టీ ఆఫీస్ ఇన్‌ఛార్జిలు రాజేష్, సోమశేఖర్‌లకు దరఖాస్తును అందజేసినట్లు తెలిపారు. రిజ్వాన్ వెంట కాంగ్రెస్ పార్టీ నేతలు ఆది రామ్మోహనరావు, కొండేటి భాస్కరరావు, జగ్గారపు బాబూరావు, మహమ్మద్ అన్సారీ తదితరులు ఉన్నారు.

ఘనంగా భావనారుషి కల్యాణోత్సవం

చల్లపల్లి : లక్ష్మీపురం శివారు శివరామదుర్గాపురం (పద్మసాలిపేట) లోని భద్రావతీ సమేత భావనారుషి స్వామి ఆలయంలో స్వామి వారి 16వ వార్షిక కల్యాణోత్సవం ఆదివారం అంగరంగ వైభవంగా జరిగింది. పద్మశాలీ బహోత్తమ సంఘం ఆధ్వర్యంలో రెండు రోజులపాటు ఉత్సవాలు జరిగాయి. పద్మశాలీయులు పెద్దఎత్తున తరలివచ్చి కల్యాణోత్సవాన్ని తిలకించి పూజలు చేశారు. భక్తులకు అన్నసమారాధన జరిగింది. టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మండలి వెంకట్రామ్ దేవాలయానికి వచ్చి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ పెద్దలు, అర్చకులు వెంకట్రామ్‌కు స్వాగతం పలికి, సత్కరించారు. లక్ష్మీపురంలోని బాలాత్రిపుర సుందరీ సహిత లక్ష్మీనాంచారమ్మ అమ్మవారి 92వ వార్షికోత్సవాలను పురస్కరించుకుని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మండలి వెంకట్రామ్‌లు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

వైభవంగా పోతురాజు స్వామి జాతర



నాగాయలంక : నాగాయలంకలో కొలువై ఉన్న శ్రీ పోతురాజు స్వామి ఆలయంలో గత రెండు రోజులుగా జరుగుతున్న స్వామివారి వార్షిక జాతర ఆదివారం రాత్రి వైభవంగా ముగిసింది. ఊరేగించిన స్వామివారి ఘటాలను ఉదయం ఆలయానికి చేరుకున్నాయి. భక్తులు మేళతాళాలు తరలివచ్చి స్వామివారికి మొక్కుబడులను, చద్ది నైవేద్యాలు భక్తితో సమర్పించారు. వివిధ గ్రామాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. దాతల ఆర్థిక సాయంతో మూడు ప్రదేశాలలో వేలాది మందికి అన్నసంతర్పణ జరిగింది. ఆలయ కమిటీ సభ్యులు ఈ కార్యక్రమాలను పర్యవేక్షించారు. భక్తులకు సదుపాయాలను నిర్వాహకుల ఏర్పాటు చేశారు. రాత్రికి స్వామివారి జాతరను గణాచారులు, భక్తులు ఘటాలను ఊరేగిస్తూ నిర్వహించారు.

పాల్ మేయర్‌కు బుద్ధప్రసాద్ సత్కారం



అవనిగడ్డ : బెతేల్ థియోలాజికల్ సెమినార్, కెనడా ప్రభుత్వం నుంచి డాక్టరేట్ పొం దిన పాస్టర్ బొండాడ పాల్ మేయర్‌ని మాజీ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్ సత్కరించారు. ఆదివారం అవనిగడ్డ రెండో వార్డులోని బెతేల్ చర్చికి వెళ్లి పాల్ మేయర్‌ని దుశ్శాలువాతో సత్కరించారు. మండలి మాట్లాడుతూ పాల్ మేయర్ దివిసీమ ప్రజలకు ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించారన్నారు. మండలి వెంకట్రామ్, కొల్లూరి వెంకటేశ్వరరావు, యాసం చిట్టిబాబు, మత్తి శ్రీనివాసరావు, కర్రా సుధాకర్, బండే రాఘవ, ఘంటసాల రాజ మోహనరావు, డేగల రాఘవ, కొల్లూరి వాసు, మోగావత్తు గోపి తదితరులు ఉన్నారు.

విద్యతోనే పేదరికం నిర్మూలన

మచిలీపట్నం టౌన్ : విద్యతోనే పేదరిక నిర్మూలన సాధ్యమని ఐపీఎస్ అకాడమీ ఛైర్మన్ డి.వెంకటేశ్వరరావు అన్నారు. మచిలీపట్నం మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం పరాసుపేట సెంటర్‌లోని సంస్థ కార్యాలయంలో జరిగిన సమావేశంలో వెంకటేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. సంస్థ అధ్యక్షుడు పి సాయికృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో విశ్రాంత ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మట్టా రాధాకృష్ణమూర్తి , భారతీయ సాహిత్య పరిషత్ అధ్యక్షుడు కారుమూరి రాజేంద్ర ప్రసాద్, పద్మావతి మహిళా జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ తలశిల దామోదర్ ,సంస్థ జిల్లా కార్యదర్శి సీతాల ప్రసాద్, కాగిత సాంబశివరావు, విశ్రాంత జడ్పీ ఏవో కె కృష్ణమోహన్, ఫణికుమార్, బాబ్జీ, విశ్రాంత సీఐ శ్రీనివాసరావు, కాపవరపు చంద్రశేఖర్ , మూర్తి తదితరులు పాల్గొన్నారు. అనంతరం రాధాకృష్ణమూర్తి, రాజేంద్రప్రసాద్‌లను ఘనంగా సత్కరించారు.

యువకుడి ఆత్మహత్య



మచిలీపట్నం టౌన్ : ప్రేమ విఫలమై యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన గోపాల్‌నగర్‌లో జరిగింది. చిలకలపూడి పోలీసులు అందించిన వివరాలిలా ఉన్నాయి. గోపాల్‌నగర్‌కు చెందిన అందే సోమేశ్వర సాయినాథ్ (19) ఇంటర్ పాసై ప్రైవేటుగా డిగ్రీ చదువుతూ తాపీ పని చేస్తున్నాడు. గూడూరుకు చెందిన యువతిని ప్రేమిస్తున్నాడు. వివాహానికి ఆమె అంగీకరించకపోవడంతో నిరాశకు గురయ్యాడు. ఆదివారం తన ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసు కున్నాడు. కుమారుడు ఆత్మహత్య చేసుకోవడంతో తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. తండ్రి నాంచారయ్య ఫిర్యాదు మేరకు చిలకలపూడి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



వివిధ పోటీల్లో విజేతలతో అధ్యాపకులు

క్రమశిక్షణతో విద్యనభ్యసించాలి

మోపిదేవి : గురుకుల పాఠశాల విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యను అలవాటు చేసుకోవాలని పాఠశాల ప్రిన్సిపాల్ కె.వీర రవి తెలిపారు. బీసీ బాలుర గురుకుల పాఠశాల వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించార ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రతి ఏడాది 10వ తరగతి, ఇంటర్మీడియట్‌లలో నూరుశాతం అత్యుత్తమ ఫలితాలు సాధిస్తూ ప్రభుత్వ పాఠశాల, కళాశాల జిల్లా స్థాయిలో గుర్తింపు పొందటం గర్వకారణమన్నారు. విద్యతోపాటు క్రీడలు, ఇతర పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరుస్తున్నట్లు తెలిపారు. పాఠశాల పేరెంట్స్ కమిటీ ఛైర్మన్ నాయుడు డేవిడ్, విశ్రాంత ఫిజికల్ డైరెక్టర్ కె.వి.సత్యనారాయణ వివిధ అంశాల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.



తెలుగు యువత ప్రతినిధులతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న మాజీ మంత్రి కొల్లు రవీంద్ర



వెనిగండ్లకు గజమాలతో స్వాగతం



పెనమకూరు అంబేడ్కర్ విగ్రహం వద్ద మాట్లాడుతున్న నారాయణరావు, కుమార్‌రాజా

టీడీపీని గెలిపించే బాధ్యత యువతదే

● మాజీ మంత్రి కొల్లు రవీంద్ర

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 25 : యువత తలచుకుంటే వైసీపీని రానున్న ఎన్నికల్లో డిపాజిట్లు లేకుండా ఓడించవచ్చని మాజీ మంత్రి, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు కొల్లు రవీంద్ర అన్నారు. మచిలీపట్నం అసెంబ్లీ నియోజకవర్గ కార్యాలయంలో ఆదివారం రాత్రి నగరంలోని 50 డివిజన్లు, 34 గ్రామాలకు చెందిన తెలుగు యువత కార్యవర్గ సభ్యులతో కొల్లు రవీంద్ర ప్రమాణ స్వీకారం చేయించారు. మచిలీపట్నం అసెంబ్లీ నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు సలీం అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వివిధ డివిజన్లు, గ్రామాలకు చెందిన కమిటీల ప్రతినిధులు ప్రమాణ స్వీకారం చేశారు. ఒక్కొక్క డివిజన్‌కు 10 మంది, ఒక్కొక్క గ్రామానికి 10 మంది కమిటీ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. తొలుత కొల్లు రవీంద్రకు టికెట్ వచ్చినందుకు గజమాలతో సత్కరించారు. కొల్లు రవీంద్ర మాట్లాడుతూ, రానున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేన కలసి పెద్ద మెజారిటీతో గెలిపించాలన్నారు. మాజీ ఎంపీ, టీడీపీ కృష్ణాజిల్లా అధ్యక్షుడు కొనకళ్ల నారాయణరావు మాట్లాడుతూ, యువత రాజకీయాల్లో చురుగ్గా పాల్గొని తెలుగుదేశం, జనసేన పార్టీ తిరిగి అధికారంలోకి వచ్చేందుకు కృషి చేయాలన్నారు. తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు హసీంబేగ్, పిన్నింటి అయ్యప్ప, కట్టా దుర్గ, చిన్నం సురేష్, కోరసిక శ్రీను, డొక్కు సాయికృష్ణ, పల్లపాటి అభినవ్, అంగర మణికుమార్, పినిశెట్టి నిరంజన్, మహమ్మద్ ఖలీల్ ప్రమాణ స్వీకారం చేయించారు. సీనియర్ టీడీపీ నాయకుడు గొర్రెపాటి గోపీచంద్, తెలుగురైతు అధ్యక్షుడు గోపు సత్యనారాయణ, మాజీ ఎంపీపీ కాగిత వెంకటేశ్వరరావు, మాజీ జడ్పీటీసీ సభ్యుడు లంకే నారాయణ ప్రసాద్, టీడీపీ రూరల్ పార్టీ అధ్యక్షుడు కుంచే నాని, నగర అధ్యక్షుడు ఎండి ఇలియాస్ పాషా, కార్యదర్శి పివ్వళ్ళ కాంతారావు, కార్పొరేటర్ చిత్తజల్లు నాగరాము, బత్తిన దాసు తదితరులు మాట్లాడారు.

బేతవోలును మోడల్ వార్డుగా తీర్చిదిద్దుతా : వెనిగండ్ల

గుడివాడ : బేతవోలును మోడల్ వార్డుగా తీర్చిదిద్దుతానని, సమస్యలను పరిష్కరించి అండగా ఉంటానని టీడీపీ. జనసేన ఉమ్మడి అభ్యర్థి వెనిగండ్ల రాము హామి యిచ్చారు. ఆదివారం బేతవోలులో బాబు ష్యూరిటీ - భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. వార్డులో ఇంటింటికి వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. జనసేన నాయకులు పాలంకి సారధిబాబు భారీ గజమాలతో వెనిగండ్లకు స్వాగతం పలికారు. తొలుత వంగవీటి మోహనరంగా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్ళులర్పించారు. ఆనందేశ్వ స్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, మున్సిపల్ మాజీ ఛైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు, అర్బన్ బ్యాంకు ఛైర్మన్ పిన్నమనేని బాబ్జీ, జనసేన ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, టిడిపి, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పామర్రులో టీడీపీ జెండా ఎగరేద్దాం

తోట్లవల్లూరు : వచ్చే ఎన్నికల్లో వర్ల కుమార్ రాజాని ఎమ్మెల్యేగా గెలిపించి పామర్రు గడ్డపై టీడీపీ జెండాను సగర్వంగా ఎగరేద్దామని జిల్లా టీడీపీ అధ్యక్షుడు, మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణరావు పిలుపునిచ్చారు. మండలంలోని గరికపర్రు, కనకవల్లి, పెనమకూరు గ్రామల్లో ఆదివారం పల్లెబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. రాత్రి పెనమకూరులో సభలో నారాయణరావు మాట్లాడుతూ అవినీతి వైసీపీ ప్రభుత్వాన్ని గద్దె దింపి చంద్రబాబుని సీఎం చేయటమే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలన్నారు. రొయ్యూరులో ఇసుక దోపిడీపై ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ నోరు విప్పాలని నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి వర్ల కుమార్ రాజా డిమాండ్ చేశారు. మండల టీడీపీ అధ్యక్షుడు వీరపనేని శివరామ్‌ప్రసాద్, ఎంపీటీసీ సభ్యుడు నర్రా వెంకట అప్పారావు, సర్పంచ్ వీరంకి రమాదేవి, పలువురు టీడీపీ, జనసేన నాయకులు ప్రజలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

వెనిగండ్ల సేవలు అభినందనీయం



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న వెనిగండ్ల సుఖదా

గుడివాడ : ఆరోగ్యకరమైన గుడివాడే లక్ష్యంగా పేదలకు ఉచిత వైద్య సేవలందిస్తున్న వెనిగండ్ల ఫౌండేషన్ అధినేత, నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ వెనిగండ్ల రాము అభినందనీయుడని మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక 30వ వార్డు వాసమాంబ గోడౌన్స్‌లో వెనిగండ్ల ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా వైద్య శిబిరాన్ని మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు ప్రారంభించారు. ఈ శిబిరంలో 14 రకాల వైద్య సేవలనందించారు. వెనిగండ్ల రాము సతీమణి సుఖదా స్వయంగా వైద్య పరీక్షలు చేయించుకుని శిబిరాన్ని పర్యవేక్షించారు. 3500 మంది వైద్య శిబిరాన్ని వినియోగించుకున్నారు. మున్సిపల్ మాజీ ఛైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు, మాజీ కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

పెడన సీటు జనసేన పార్టీకి ఇవ్వనందుకు నిరసన



బండ్రెడ్డి రామకృష్ణ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న సమ్మెట బాబు వర్గీయులు

పెడన, ఫిబ్రవరి 25 : పెడన సీటును జనసేన పార్టీకి ఇవ్వనందుకు నిరసనగా సమ్మెట బాబు వర్గీయులు ఆదివారం బల్లిపర్రులో జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు బండ్రెడ్డి రామకృష్ణ దిష్టిబొమ్మను దహనం చేశారు. రామకృష్ణ చేతకాని తనం వల్లే పెడన సీటు జనసేన పార్టీకి రానందున ఆయనను జిల్లా పార్టీ అధ్యక్ష పదవి నుంచి తొలగించాలని నినాదాలు చేశారు. అంతకు ముందు జరిగిన ప్రెస్‌మీట్‌లో రామకృష్ణతో పాటు నియోజకవర్గ సమన్వయకర్త పంచకర్ల సురేష్‌పై సమ్మెట బాబు విమర్శలు చేశారు. పెడన సీటును జనసేన పార్టీకి కేటాయిస్తారని ఎంతో ఆశతో ఎదురు చూశామని, అయితే టీడీపీకి కేటాయించడంతో తీవ్ర నిరాశకు గుర య్యామన్నారు. పునరాలోచించి సీటు జనసేన పార్టీకి కేటాయించాలని, లేనిచో తమ సత్తా చూపిస్తామని ఆయన హెచ్చరించారు. సమ్మెట బాబు ప్రత్యేకించి ఒక సామాజిక వర్గానికి సీటు ఇవ్వాలని కోరగా సమావేశంలో పాల్గొన్న బత్తిన హరిరామ్ ఏ సామాజిక వర్గానికి సీటు ఇచ్చినా అభ్యంతరం లేదని, అయితే ఇక్కడ మాత్రం జనసేన పార్టీ జెండా ఎగరాలన్నదే తమ ఆశయమన్నారు. ఆలస్యంగా సమావేశానికి వచ్చిన దాసరి సత్యనారాయణ మా ట్లాడుతూ, అధినేత పవన్‌కళ్యాణ్ తీసుకున్న నిర్ణయానికి కట్టుబడి ఉండాల్సిందేనన్నారు. పొత్తు ధర్మాన్ని గౌరవించి టీడీపీ అభ్యర్థి కాగిత కృష్ణప్రసాద్‌కు మద్దతు ఇస్తున్నట్లు సత్యనారాయణ ప్రకటించారు. దీంతో సమ్మెట బాబు వర్గీయులు, సత్యనారాయణ వర్గీయుల మధ్య తీవ్ర స్థాయిలో వాదోపవాదాలు జరిగాయి.



అంగలూరు డైట్ మొదటి బ్యాచ్ ఆత్మీయ సమ్మేళనం

గుడ్లవల్లేరు : ప్రభుత్వ ఉపాధ్యాయ శిక్షణా సంస్థ అంగలూరు (డైట్) కళాశాల మొదటి బ్యాచ్ (1984-85) పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం కళాశాలలో ఘనంగా నిర్వహించారు. 38 సంవత్సరాల తరువాత కలుసుకున్న విద్యార్థులు మధుర స్మృతులను నెమరవేసుకొన్నారు. ఉల్లాసంగా, ఉత్సాహంగా గడిపారు. నాటి అధ్యాపకులు ఎం.వరకుమార్, కె.రామచంద్రరావు, కె.బి.కె. చౌదరిలను ఘనంగా సన్మానించారు. ఉద్యోగ విరమణ చేసిన ఆ బ్యాచ్ లోని పూర్వ విద్యార్థులను కూడా సన్మానించారు. ఎ.సుబ్రహ్మణ్యం, టి.శ్రీనివాస్, వి.బాలాజీ,ఇ. వెంకటేశ్వరరావు, వి.విజయ్‌కుమార్, ఎ.వరలక్ష్మి, కె.అన్నపూర్ణ, డైట్ కళాశాల ప్రిన్సిపాల్ కె.లక్ష్మీ నారాయణ, అధ్యాపకులు వినయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్-2 పరీక్షలు ప్రశాంతం

గుడ్లవల్లేరు, ఫిబ్రవరి 25 : గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కళాశాలలో గ్రూప్ - 2 పరీక్ష ఆదివారం ప్రశాంతంగా నిర్వహించారు. ఈ కేంద్రంలో 800 మంది అభ్యర్థులు హాజరు కావాల్సి ఉండగా 630 మంది హాజరయ్యారు. 170 మంది గైర్హాజరయ్యారని పరీక్షా కేంద్రం చీఫ్ ఎగ్జామినర్ డాక్టర్ బుర్రా కరుణ కుమార్, అసిస్టెంట్ చీఫ్ ఎగ్జామినర్ డాక్టర్ ఎం.ఆర్.సిహెచ్ శాస్త్రి తెలిపారు. పరీక్షా కేంద్రాన్ని జిల్లా ఎస్పీ నయామ్ అస్మి, గుడివాడ రూరల్ సీఐ ఏసుబాబు, గుడ్లవల్లేరు ఎస్సై సత్యనారాయణ పరీక్షా కేంద్రాన్ని సందర్శించారు. పరీక్షా కేంద్రం వద్ద కట్టుదిట్టమైన పోలీసు భద్రత ఏర్పాటు చేశారు.

పామర్రు : పామర్రు జిల్లా పరిషత్ హైస్కూల్, అస్సెస్సీ ఇంగ్లీషు మిడియం హైస్కూల్లో ఆదివారం గ్రూప్-2 పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. జడ్పీ ఉన్నత పాఠశాలలో 250 మంది అభ్యర్థులకు గాను 187 మంది పరీక్షలకు హాజరైనట్లు ఎంపీడీవో మద్దిపట్ల భారతి తెలిపారు. అసెస్సీ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్లో 250 మందికి 200 మంది హాజరైనట్లు తహసీల్దార్ శ్రీపల్లవి చెప్పారు. రెండు సెంటర్లో కలిపి 113 మంది పరీక్షలకు గైర్హాజరైనట్లు తెలిపారు.

పాలకాయితిప్ప మెరైన్ సీఐగా మోహన్ రెడ్డి

కోడూరు : పాలకాయితిప్ప మెరైన్ స్టేషన్ సీఐగా మోహన్ రెడ్డి శనివారం బాధ్యతలు చేపట్టారు. బాధ్యతలు చేపట్టిన మోహన్‌రెడ్డి స్టేషన్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. తీరం వెంట పటిష్టమైన నిఘా ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

షార్ట్ సర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధం

మోపిదేవి : వెంకటాపురంలో ఆదివారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మాతంగి ఆదిశేషుకు చెందిన పూరిల్లు దగ్ధమైంది. రూ.15 వేల నగదు, సామాగ్రి దగ్ధమై రూ.40 వేల మేర నష్టం వాటిల్లినట్లు బాధితులు తెలిపారు. వీఆర్వో కె.వరప్రసాద్ వివరాలు సేకరించారు.

సచివాలయాలతో ప్రజలకు మెరుగైన సేవలు

మోపిదేవి : సచివాలయ వ్యవస్థతో ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు తెలిపారు. పెదప్రోలులో రూ.43 లక్షలతో నూతనంగా నిర్మించిన సచివాలయ భవనాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. సర్పంచ్ ఏసుబాబు, పీఏసీఎస్ ఛైర్మన్ రాంబాబు, పీఆర్ ఏఈశ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి కె.రామకోటేశ్వరరావు, ఆయా శాఖల ఉద్యోగులు ఉన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

పెడన : ఎస్సై సూర్యశ్రీనివాస్ ఆదివారం తన సిబ్బందితో దాడి చేసి ఎనిమిది మంది పేకాటరాయుళ్లను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి లక్షా 14 వేల రూపాయలు స్వాధీనం చేసుకున్నారు.

ఘనంగా మెహెర్‌బాబా 130వ జయంతి

చల్లపల్లి : మానవులంతా ఒక్కటేననీ, మనిషిలోనే దేవుడున్నాడని ముక్తిమార్గాలను ప్రబోధించిన అవతార పురుషుడు అవతార్ మెహెర్‌బాబా 130వ జయంతిని ఆదివారం చల్లపల్లిలో ఘనంగా నిర్వహించారు. బాబా మందిరంలో ఈనెల ఒకటవ తేదీన ప్రారంభమైన బాబా జయంతి ఉత్సవాలు ఆదివారంతో ఘనంగా ముగిశాయి. సుమారు ఐదు వేల మంది భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించారు. బాబాసెంటర్ అధ్యక్ష, కార్యదర్శులు సిహెచ్.ఎంవిఎస్ఆర్‌కె.ప్రసాద్, పత్రి వెంకట రమణారావు ప్రభృతులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

పెడన మున్సిపల్ కమిషనర్ మహేంద్ర మృతి

పెడన, ఫిబ్రవరి 25 : పెడన మునిసిపల్ కమిషనర్ బంటుమిల్లి మహేంద్ర (52) విజయవాడలోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో అనారోగ్యంతో ఆదివారం ఉదయం మృతి చెందారు. గత ఏడాది జూన్‌లో మహేంద్ర పెడన మునిసిపల్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టారు. లివర్ ప్లాంటేషన్ కోసం ఏర్పాట్లు జరుగుతున్న నేపథ్యంలో గురువారం ఆయన తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. వెంటనే మహేంద్రను విజయవాడలోని ప్రైవేటు ఆసుపత్రిలో చేర్చగా చికిత్స పొందుతూ మృతిచెందారు. ఆయన భౌతిక కాయాన్ని ఏలూరులోని ఆయన స్వగృహానికి తరలించారు. మహేంద్రకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఇన్‌ఛార్జి కమిషనర్ ఏసుబాబు, కార్యాలయ ఉద్యోగులు ఏలూరులోని మహేంద్ర స్వగృహానికి వెళ్ళి ఆయన భౌతిక కాయానికి శ్రద్ధాంజలి ఘటించారు.